ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
శనివారం 1 మార్చి 2025 | 5






హాకీలోనూ.. సివిల్ పవర్ చూపారు!

చదువుల్లోనే కాదండోయ్.. ఆటల్లోనూ తగ్గేదేలే అన్నారు.. కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో రెండు వారాలుగా హోరా హోరీగా సాగుతున్న ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ శుక్రవారం ముగిసింది. పోటీల్లో భాగంగా మహిళల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచిన ఒడిశా సెక్రటేరియట్ టీమ్‌కు ట్రోఫీ అందజేసి అభినందించారు.


6

గోదారిలో.. తలపడ్డారు!

బైక్ రేస్ తెలుసు.. కార్ రేస్ తెలుసు.. మరి బోట్ రేస్ గురించి ఇప్పటివరకూ ఎక్కడైనా విన్నారా.. చూశారా.. విని ఉంటారు కానీ చూసి ఉండరు.. రాజమహేంద్రవరం పుష్కరఘాట్ వద్ద శుక్రవారం బోట్ రేస్ సాగింది.. సుమారు 15 బోట్లపై పడవలు వేసుకుని హోరాహోరీగా ఇలా తలపడ్డారు.. ముగ్గురు విజేతలుగా నిలిచారు.


7

సంక్షేమ.. పద్దు పొడుపు!



సంక్షేమంలో 'పద్దు' పొడిచింది.. పయ్యావుల పద్దు సంక్షేమం, అభివృద్ధి మంత్రం జపించింది. అన్ని వర్గాల ను లక్ష్యంగా చేసుకుని వరాల వాన కురిపించింది. మహిళలను మురిపించి.. అన్నదాతలను మెప్పించి... పేదలకు ధీమా కల్పిస్తూ బడ్జెట్ పద్దు బహుబాగు అనిపించింది. పేదలకు ఆరోగ్య ధీమా కల్పించింది. ఏటా రూ.25 లక్షల ఆరోగ్య బీమా అమలు చేస్తున్నట్టు ప్రకటించి ధైర్యం ఇచ్చింది.. ఎన్నికల్లో పార్టీని విజయ తీరాలకు చేర్చిన సూపర్ సిక్స్ హామీల అమలుకు శ్రీకారం చుట్టేలా పద్దులో కేటాయింపులు చేసింది.. - (కాకినాడ/ఆంధ్రజ్యోతి)

- అదిరిన 'పయ్యావుల' పద్దు
- రూ.25 లక్షల ఆరోగ్య బీమా
- 12.50 లక్షల కుటుంబాలకు ధీమా
- మే నుంచే తల్లికి వందనం
- 16.51 లక్షల మంది పిల్లలకు లబ్ధి
- అన్నదాత సుఖీభవకు 4.54 లక్షల మంది
- 19.80 లక్షల మందికి ఆదరణ
- స్కూళ్లకు కరెంటు బిల్లు బాధలేనట్టే
- మునిసిపాలిటీలకు మళ్లీ ఆర్థిక స్వేచ్ఛ
- మత్స్యకారులకు నిధుల పొంగు

బీమా...ఆరోగ్య ధీమా..

పేద వర్గాలకు ఆరోగ్యపరంగా ధీమా కల్పించేందుకు రూ.25 లక్షల ఆరోగ్య బీమా పథకాన్ని పేదలకు అమలు చేస్తామని ప్రకటించారు. బడ్జెట్‌లో రూ.19,264 కోట్లు కేటాయించారు. బడ్జెట్‌లో ప్రకటించిన రూ.25 లక్షల ఆరోగ్య బీమా పేదల జీవితాలకు మేలి మలుపే. ఈ బీమాతో కార్పొరేట్ ఆసుపత్రుల్లో పైసా చెల్లించక్కర్లేకుండా చికిత్స పొందొచ్చు. ఈ వరంతో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో దాదాపు 12.50 లక్షల కుటుంబాలకు ప్రయోజనం కలగనుంది.

తల్లులకు ఇక పండగే..

బడ్జెట్‌లో తల్లికి వందనం పథకానికి కూటమి ప్రభుత్వం రూ.9,407 కోట్లు కేటాయించింది. ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లు,కాలేజీలో చదువుతున్న ఒకటి నుంచి 12వ తరగతి వరకు రూ.15 వేలు జమ చేస్తామని ప్రకటించారు. మే నెలలోగా తల్లుల ఖాతా ల్లో డబ్బులు జమ చేస్తామని తెలిపారు. ఈ మేరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 16.51 లక్షల మంది పిల్లలకు సంబంధించి తల్లులకు ఆర్థిక ప్రయోజనం కలగనుంది. జిల్లాకు రూ.2,476 కోట్ల నిధులొస్తాయి.

మరింత ఆదరణ..

గత టీడీపీ ప్రభుత్వంలో బీసీల్లో ఆయా వర్గాల స్వయం ఉపాధికి అనుగుణంగా ఆద రణ పథకం కింద సీఎం చంద్రబాబు పని ముట్లను అందించారు. జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆదరణ అటకెక్కించారు. మళ్లీ కూటమి ప్రభుత్వం ఆదరణ పథకం అమలుకు శుక్రవారం నాటి బడ్జెట్‌లో వెయ్యి కోట్లు ప్రకటించారు.

సొంతింటి కల నెరవేరినట్లే..

బడ్జెట్‌లో ప్రధానంగా రహదారుల శాఖకు రూ.8,785 కోట్లు కేటాయించారు. ఉమ్మడి జిల్లాలో అనేక రహదారుల మరమ్మతులకు, కొత్త వాటికి నిధులు రానున్నాయి. గృహ నిర్మాణ శాఖకు రూ.6,318 కోట్లు కేటాయించడంతో పేదల ఇళ్లకు ఇబ్బందులు తప్పనున్నాయి. ఆధునికీకరణ పనులకు రూ.848 కోట్లు కావాలి. అయితే ఈ రెండేళ్లలో వీటిని పట్టాలెక్కించేందుకు వీలుగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఉన్నత విద్యకు సంబంధించి కేటాయింపులు పెరిగాయి. ఆదికవి నన్నయ వర్సిటీకి రూ.12.50 కోట్లు, జేఎన్టీయూకి రూ.60 కోట్లు కేటాయించారు.

మునిసిపాలిటీలకు వీడిన సంకెళ్లు

పట్టణాలు, నగరాల అభివృద్ధిలో మునిసిపాలిటీలు, కార్పొరేషన్లదే కీలకపాత్ర. గత వైసీపీ ప్రభుత్వం వీటిని పూర్తిగా సర్వనాశనం చేసేసింది. గడచిన ఐదేళ్లలో మునిసిపాలిటీల్లో డబ్బులు ఖర్చుచేయడం గగనంగా మారింది. ఏప్రిల్ నుంచి మునిసిపాలిటీలు తమ చెల్లింపులు తమ నిధుల నుంచి ఖర్చుచేసుకునేలా కీలక నిర్ణయం ప్రకటించింది. దీంతో పుర పాలికలకు మళ్లీ మంచిరోజులు వచ్చినట్లయింది.

మత్స్యకారులకు వరం..

మత్స్యకార భరోసా రూ.450 కోట్లు కేటాయించారు. ఏటా వేట నిషేధ సమయంలో మత్స్యకారులను ఆదుకునే పేరుతో అప్పటి వైసీపీ ప్రభుత్వం రూ.10 వేలు ఇచ్చేది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత దీన్ని రూ.20 వేలు చేస్తామని చెప్పింది. బడ్జెట్‌లో రూ.450 కోట్లు కేటాయించింది.ఉమ్మడి జిల్లాలో 3.50 లక్షల మంది మత్స్యకారులకు మేలు జరగనుంది.

తాగునీటికి.. బెంగ లేదిక..

జలజీవన్ మిషన్ కింద గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికి తాగునీరు ఇచ్చే ఉద్దేశంతో 8.46 లక్షల కుళాయిలను అందించాలని అధికారులు లక్ష్యం విధించుకున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రూ.1, 203 కోట్లతో ప్రణాళికలు రచించారు. కానీ అప్పటి వైసీపీ ప్రభుత్వం పథకాన్ని నీరుగార్చేసింది. కూటమి ప్రభుత్వం ప్రాజెక్టును పూర్తి చేయాలని లక్ష్యంగా విధిం చుకుంది. బడ్జెట్‌లో రూ.2,800 కోట్లు కేటాయించింది. ఈ పథకానికి నిధుల బెంగతీరింది.

బడికి బిల్లులు బాధ తీరినట్టే..

ప్రభుత్వ పాఠశాలలకు ఉచితంగా విద్యుత్ ఇవ్వనున్నట్టు రాష్ట్ర బడ్జెట్‌లో ప్రభుత్వం ప్రకటించింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 2 వేలకుపైగా స్కూళ్లు ఉన్నాయి. ఇకపై ఉచితంగా విద్యుత్ ఇవ్వనుండడంతో పాఠశాలలకు నిధుల బెంగ తప్పనుంది.

కూటమి సూపర్ బడ్జెట్
మురిపించేను

(కాకినాడ/రాజమహేంద్రవరం/అమలాపురం-ఆంధ్రజ్యోతి)

బడ్జెట్‌లో నీటిపారుదల రంగానికి ఇచ్చిన ప్రాధాన్యం రైతులను సంతృప్తిపరిచింది. ఎంతో కాలంగా డెల్టా ఆధునికీకరణ, ఎత్తిపోతల పథకాలు మూలనపడిపోయాయి. పోలవరం ప్రాజెక్టు సైతం నత్తనడకన సాగుతోంది. బడ్జెట్‌లో పోలవరం ప్రాజెక్టు రూ.6705 కోట్లు కేటాయించడంతో పనుల వేగానికి ఇంధనంగా ఉపయోగపడతాయి. పోలవరం నిర్వాసిత కుటుంబాలకు ఇటీవల 900 కోట్లకు పైగా ఆర్థిక సాయాన్ని వారి ఖాతాల్లో జమ చేశారు. సాధ్యమైనంత మేర నిర్వాసితులందరినీ కాలనీలకు చేర్చేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ఇక ధవళేశ్వరం కేంద్రంగా ఉన్న గోదావరి డెల్టా సిస్టమ్ ఆధునికీకరణకు రూ.200 కోట్లు కేటాయించారు. బడ్జెట్‌లో ఏటిగట్ల అభివృద్ధికి మరో రూ.200 కోట్లు కేటాయించారు. పోలవరం లిఫ్ట్‌కు రూ.100 కోట్లు, తాడిపూడి ఎత్తిపోతల పథకానికి రూ.14 కోట్లు, వెంకటనగర్ ఎత్తిపోతలకు రూ.4 కోట్లు, పురుషోత్తపట్నం ఎత్తిపోతలకు రూ.75.51 కోట్లు, సూరంపాలెం ప్రాజెక్టుకు రూ.65 లక్షలు, తొర్రిగడ్డ పంపింగ్ స్కీమ్‌కు రూ.7.5 కోట్లు కేటాయించి జీవం పోవారు. ధవళేశ్వరం ఇరిగేషన్ పరిధిలో వేసవి కాలంలో చేపట్టే ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓఅండ్ఎం) పనులకు రూ.75 కోట్లు కేటాయించారు. ఆయిల్ పామ్ పంటల ప్రోత్సాహ నికి తూర్పు గోదావరి జిల్లాను ప్రత్యేకంగా ఎంపిక చేసింది.బడ్జెట్‌లో రూ.7,556 కోట్లు, రైతులకు ఉచిత విద్యుత్ వంటి అనేక రకాల పథకాల అమలుకు వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు అధిక ప్రాధాన్యం ఇచ్చారు.

అన్నదాత.. సుఖీభవ

సూపర్‌సిక్స్ హామీల్లో భాగంగా అన్నదాత సుఖీభవ పథకానికి ఈ బడ్జెట్‌లో ప్రభుత్వం పెద్దపీట వేసింది. ఈ మేరకు రూ.6,300 కోట్లు కేటాయించింది. దీంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అన్నదాతలకు ఇక సాగు ఖర్చుల బెంగ తీరనుంది. గత వైసీపీ ప్రభుత్వం రైతు భరోసా పథకం పేరుతో కేంద్రవాటాతో కలిపి రూ.13,500 ఇచ్చి అన్నదాతలను మోసం చేసింది. రైతులకు అండగా చంద్రబాబు అన్నదాత సుఖీభవ పథకాన్ని ఎన్నికల ముందు ప్రకటించారు. అర్హుడైన ప్రతి రైతుకు ఏటా రూ. 20 వేలు ఇస్తామని ప్రకటించారు. బడ్జెట్ కేటాయింపులు చేశారు. ఫలితంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 4.54 లక్షల మంది రైతులకు పథకం ద్వారా రూ.908 కోట్ల లబ్ధి చేకూరనుంది. కాకినాడ జిల్లాలో 1.86 లక్షల మంది అన్నదాతలకు రూ.370 కోట్లు, తూర్పుగోదావరి జిల్లాలో 1.21 లక్షలు, అంబేడ్కర్ కోనసీమలో 1.65 లక్షల మందికి ప్రయోజనం చేకూరనుంది.

ప్రాజెక్టు	రూ.కోట్లలో
పోలవరం ప్రాజెక్టు	6,705
గోదావరి డెల్టా సిస్టమ్‌కు	200
ఏటిగట్ల అభివృద్ధికి	200
పోలవరం లిఫ్ట్‌కు	100
తాడిపూడి ఎత్తిపోతలకు	14
వెంకటనగర్ ఎత్తిపోతలకు	4
పురుషోత్తపట్నం ఎత్తిపోతలకు	75.51
తొర్రిగడ్డ పంపింగ్ స్కీమ్‌కు	7.5

సూరంపాలెం ప్రాజెక్టుకు రూ.65 లక్షలు

స్వర్ణాంధ్రకు తొలి అడుగులు..



వ్యవసాయరంగానికి, అన్నదాత సుఖీభవ పథకానికి నిధుల కేటాయింపు హర్షణీయం. వేట నిషేధకాలంలో మత్స్యకారులకు రూ.20వేల ఆర్థికసాయంతో పాటు ఆదరణ, తల్లికివందనం పథకాలకు నిధులిచ్చారు. సీఎం చంద్రబాబు స్వర్ణాంధ్ర సాధనే లక్ష్యంగా బడ్జెట్ ద్వారా తొలి అడుగులు వేశారు. - సుభాష్, మంత్రి

ఇది చంద్రబాబు విజన్ బడ్జెట్



ఇది సీఎం చంద్రబాబు విజన్ బడ్జెట్. సూపర్-6 పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు బడ్జెట్ దోహద పడుతుంది. మౌలిక వసతులు, రోడ్లు, విద్యుత్, వైద్యం, రైతుల కోసం ప్రత్యేకంగా నిధుల కేటాయింపు చాలా అద్భుతంగా జరిగింది. - అయితాబత్తుల ఆనందరావు, అమలాపురం ఎమ్మెల్యే

అన్ని రంగాలకు పెద్దపీట



బడ్జెట్ రాష్ట్రంలో అన్ని వర్గాలు, అన్ని రంగాలకు మేలు చేసేలా ఉంది. గత ప్రభుత్వం అన్ని రంగాలకు విస్మరించి నాశనం చేసింది. కానీ కూటమి ప్రభుత్వం 2047 విజన్ లక్ష్యంగా చంద్రబాబు బడ్జెట్‌కు రూపకల్పన చేశారు. - వేగుళ్ల జోగేశ్వరరావు, మండపేట ఎమ్మెల్యే, రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్

రాష్ట్ర పునర్నిర్మాణం దిశగా..



రాష్ట్ర పునర్నిర్మాణంతోపాటు ప్రజలకు మేలుచేసే విధంగా బడ్జెట్ ఉంది. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆలోచనా విధానాలకు అనుగు ణంగా రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా బడ్జెట్ రూపొందడం సంతోషకరం. - బండారు సత్యానందరావు, కొత్తపేట ఎమ్మెల్యే

జనరంజకంగా తొలి బడ్జెట్



కూటమి ప్రభుత్వం తొలి బడ్జెట్ జనరంజకంగా ఉంది. ప్రజల ఆలోచనలు, ఆకాంక్షలు బడ్జెట్‌లో అద్భుతంగా ఆవిష్కృతం అయ్యాయి. అన్నదాతల అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించింది. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు పెద్దపీట వేశారు. - దేవ వరప్రసాద్, రాజోలు ఎమ్మెల్యే

అభివృద్ధికి, సంక్షేమానికి పెద్దపీట



బడ్జెట్ అన్ని వర్గాలకు న్యాయం చేకూర్చేలా ఉంది. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు పెద్దపీట వేశారు. ఇరిగేషన్‌కు ఏకంగా రూ.18,020 కోట్లు కేటాయించారు. పోలవరం ప్రాజెక్టు, అమరావతి నిర్మాణాలకు వేలాది కోట్లు కేటాయించడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం. - దాట్ల బుచ్చిబాబు, ముమ్మిడివరం ఎమ్మెల్యే

సంక్షోభంలోనూ.. సంక్షేమం



రాష్ట్రంలో సంక్షోభంలో ఉన్నా సంక్షేమ రంగానికి అధిక నిధులు కేటాయించడం విశేషం. ముఖ్యంగా ఎస్సీ కార్పొరేషన్ రుణాల కోసం రూ.20కోట్లపైగా నిధులు కేటాయించారు. వ్యవసాయానికి అధిక ప్రాధాన్యం లభించింది. సాగులో యాంత్రీకరణకూ పెద్దపీట వేశారు. - గిడ్డి సత్యనారాయణ, పి గన్నవరం ఎమ్మెల్యే



అమలాపురం జూనియర్ కళాశాలలో పరీక్షల ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఇంటర్మీడియట్ జిల్లా అధికారి సోమశేఖర్

విజయీభవ!

- నేటి నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం
- జిల్లాలో 40 పరీక్షా కేంద్రాలు ఏర్పాలు
- ప్రథమ, ద్వితీయ ఇంటర్ విద్యార్థులు 27,312 మంది
- పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు
- పరీక్షల పర్యవేక్షణకు కంట్రోల్‌రూము ఏర్పాటు
- ఇంటర్ విద్యాశాఖాధికారి సోమశేఖర్

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలో శనివారం నుంచి ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణకు అధికార యంత్రాంగం సన్నద్ధమైంది. మార్చి 1వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జరిగే ఇంటర్ ప్రథమ, ద్వితీయ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తారు. జిల్లాలోని ఇందుకోసం 40 పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేశారు. ఈ పరీక్షల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు 13,431 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 13,881 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్షా కేంద్రాల్లోని ప్రాంతాల్లో 14 స్టోరేజ్ పాయింట్స్ అయిన పోలీసుస్టేషన్ల నుంచి ప్రతీరోజు ప్రశ్నాపత్రం బండిల్స్‌ను పోలీసు బందోబస్తు నడుమ చీఫ్ సూపరింటెండెంట్ డిపార్టుమెంటల్ అధికారి ఆయా పరీక్షా కేంద్రాలకు తీసుకువెళతారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. అమలాపురంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఉన్న ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి కార్యాలయంలో కంట్రోల్ రూమును ఏర్పాటుచేశారు. 9550335191 నంబరులో సంప్రదించవచ్చు. కలెక్టరేట్‌లో కూడా కంట్రోల్‌రూము ఏర్పాటుచేశారు. ఇద్దరు అధ్యాపకుల పర్యవేక్షణలో జిల్లాలోని పరీక్షా కేంద్రాల్లో జరిగే పరీక్షల తీరును సీసీ టీవీల ద్వారా పరిశీలిస్తారు. పరీక్షా సమయం అరగంటకు ముందుగా విద్యార్థులు పరీక్షా కేంద్రానికి చేరుకోవాల్సిందిగా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి వనుము సోమశేఖర్ విజ్ఞప్తి చేశారు. విద్యార్థులు పరీక్షలు రాయడానికి 24 పేజీల జవాబు పత్రాన్ని ఇస్తారు. సీసీ కెమెరాల నిఘాలో పరీక్షల తీరును సమీక్షిస్తారు. పరీక్ష కేంద్రం ప్రాంగణ ప్రదేశాల్లో సెల్‌ఫోన్ నిషేధం. కేవలం ఒక చీఫ్ సూపరింటెండెంట్ మాత్రమే ఇంటర్మీడియట్ విద్యామండలి సప్లయి చేసిన కీప్యాడ్ సెల్‌ఫోన్‌ను ఉపయోగిస్తారు. పరీక్షలు జరిగే ప్రాంతాల్లో జిరాక్సు సెంటర్లను మూసివేయాలనే నిబంధన ఉంది. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకోసం ఏపీఎస్ఆర్టీసీ బస్సు సౌకర్యాలు కూడా కల్పించింది. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పరీక్షా కేంద్రం వద్ద శిబిరాలు నిర్వహించి అనారోగ్యంతో ఉండే విద్యార్థులకు వైద్యసేవలు అందిస్తారు. ప్రతీ కేంద్రంలో గాలి, వెలుతురు ఉండడం, తాగునీటి సదుపాయం, బాలబాలికలకు వేర్వేరు టాయిలెట్లు ఉండాలని అధికారులు సూచించారు. పరీక్షల నిర్వహణ, పరిశీలనకు రెండు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, మూడు సిటింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటుచేశారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌లలో ఒక డిప్యూటీ తహశీల్దార్, ఏఎస్ఐ, లెక్చరర్ ఉంటారు. సిట్టింగ్ స్క్వాడ్‌లలో ఇద్దరు లెక్చరర్లు ఉంటారు. ఎక్కువ పరీక్షా కేంద్రాలు ఉన్నచోట అక్కడే కస్టోడియన్ పోలీసుస్టేషన్‌లో చీఫ్ సూపరింటెండెంట్ డిపార్టుమెంట్ ఆఫీసర్లకు ప్రశ్నాపత్రాల బండిల్స్ అందజేస్తారు. పరీక్షల్లో విద్యార్థులు సమయానికి హాజరై పరీక్షలు రాయాల్సిందిగా జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి విజ్ఞప్తి చేశారు. పరీక్షా కేంద్రాల్లోని ఏర్పాట్లను ఆయన పరిశీలించారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు
- జడ్పీ సీఈవో



గుండెపూడిలో గోడి వాటరు ప్రాజెక్టును పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో వీవీవీఎస్ లక్ష్మణరావు

అల్లవరం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వేసవికాలంలో తాగునీటి ఎద్దడి రాకుండా ఆర్‌డబ్ల్యుఎస్ ప్రాజెక్టుల ద్వారా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని జడ్పీ సీఈవో వీవీవీఎస్ లక్ష్మణరావు అన్నారు. అల్లవరం మండలం బోడసకుర్రు, గుండెపూడి గ్రామాల్లో ఆర్‌డబ్ల్యుఎస్ వాటరు ప్రాజెక్టులను క్షుణ్ణంగా పరిశీలించి అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. బోడసకుర్రు వాటరు ప్రాజెక్టులో 15హెచ్‌పీ మోటారు, బోరు ఏర్పాటు, 110 కేవీ మోటారు పెంపుదలకు రూ.12 లక్షల అంచనా వ్యయంతో జిల్లా పరిషత్ రూ.6 లక్షల నిధులు ఇస్తుందన్నారు. గుండెపూడి వాటరు ప్రాజెక్టు 13 ఎకరాల చెరువు చుట్టూ రక్షణకు ఫెన్సింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. బోడసకుర్రు వాటరు ప్రాజెక్టుకు రూ.6 లక్షల నిధులు మంజూరు చేస్తున్నామన్నారు. అల్లవరంలో క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబురాజు, ఎంపీపీ యిళ్ల శేషగిరిరావు, జడ్పీటీసీ కొనుకు గౌతమి, ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్‌లు సీఈవో లక్ష్మణరావును ఘనంగా సన్మానించారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఇన్‌చార్జి డీఈఈ రాంప్రసాద్, ఎంపీడీవో కృష్ణమోహన్, బోడసకుర్రు సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి వెంట ఉన్నారు.

సైన్స్ సెంటర్‌కి స్వామిజ్ఞానానంద పేరు పెట్టాలి
కేంద్రానికి రాష్ట్ర సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ లేఖ

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి28(ఆంధ్రజ్యోతి): కేంద్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలోని నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ మ్యూజియం విభాగం, ఏపీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖలు ఉమ్మడిగా రాజమహేంద్రవరంలో నిర్మించిన రీజనల్ సైన్స సెంటర్‌కు స్వామి జ్ఞానానంద పేరును పెట్టాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రతిపాదించారు. ఈ మేరకు కేంద్ర సాంస్కృతిక శాఖ కార్యదర్శికి రాష్ట్ర ప్రభుత్వ అటవీ పర్యావరణ సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.అనంతరాము లేఖ రాశారు. రాజమహేంద్రవరంలో రూ.15.20 కోట్లతో ఈ సెంటర్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్మించాయి. క్యాపిటల్ ఫండ్ రూ.11.7 కోట్లలో 50:50 రేషియోలో, కార్పస్‌ఫండ్ రూ.3.5 కోట్లలో 80:20 శాతం రేషియోలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులను అందించి సైన్స్ సెంటర్ నిర్మాణం పూర్తిచేశాయి. స్వామిజ్ఞానానంద న్యూక్లియర్‌సైన్స్ బోధనలో తన ప్రత్యేకతను చాటుకున్నారు. ఆంధ్రా వర్సిటీలోని న్యూక్లియర్ సైన్స్ విభాగానికి ప్రత్యేకతను తీసుకురావడంలో విశేషమైన కృషిచేశారు. ఎందరో విద్యార్థులను గొప్ప శాస్త్రవేత్తలుగా తయారుచేసిన ఆయన పేరును పెట్టాలని కోరారు.

యానాంలో చెత్త బాగోతం

- ప్రజారోగ్యం గాలికి..
- పట్టించుకోని నాయకులు, అధికారులు
- ఎక్కడి చెత్త అక్కడే
- కంపు కొడుతున్న డస్ట్ బిన్స్
- ఉన్న డంపింగ్ యార్డు మూసివేత
- చెత్తా ఎక్కడా వేయనివ్వరు




కనకాలపేట డంపింగ్ యార్డులోకి ట్రాక్టర్లు వెళ్లకుండా మూసివేసిన దృశ్యం





యానాం రోడ్ల పక్కన చెత్త పడేసిన దృశ్యాలు

యానాం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అంతర్భాగమైన కేంద్రపాలిత ప్రాంతం యానాం పర్యాటకులకు కేంద్రం. ఇప్పుడా పరిస్థితి లేదు. మౌలిక సదుపాయాలతోపాటు పారిశుధ్యం విషయంలోనూ అధ్వానంగా ఉండడంతో పర్యాటకులు పెదవివిరుస్తున్నారు. ముఖ్యంగా యానాం వీధుల్లో చెత్త తొలగింపు నిలిచిపోయింది. రెండు మూడు రోజులు గడిచినా చెత్త తీయకపోతుండడంతో ఆ ప్రాంతమంతా దుర్వాసనగా మారుతోంది. ఈ విషయంలో రాజకీయ వివాదం కూడా తోడవడంతో మరింత అధ్వాన పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సమస్యను అటు పాలకులు పట్టించుకోక, ఇటు అధికారులు స్పందించని దుస్థితి ఏర్పడింది. యానాం పరిధిలోని కనకాలపేటలో ఉన్న డంపింగ్ యార్డు స్థానికుల ఆందోళనతో మూసివేశారు. దీంతో ఉన్న చెత్తను ఎక్కడ వెయ్యాలో తెలియక పారిశుధ్య సిబ్బంది చెత్త తొలగింపు గత రెండు రోజులుగా పూర్తిగా మానేశారు. కొంతమంది సిబ్బంది ట్రాక్టర్లతో చెత్తను ఇతర ప్రాంతాల్లో డంప్ చేసేందుకు తీసుకువెళితే ఎక్కడికక్కడ స్థానికులు తిరగబడుతున్నారు. దీంతో ఆయా ప్రాంతాలకు వెళ్లిన ట్రాక్టర్లు వెనుదిరుగుతున్నాయి. దీనిపై ఏం చెయ్యాలో తెలియని స్థితిలో మున్సిపల్‌శాఖ, పరిపాలనా యంత్రాంగం అయోమయ స్థితిలోఉన్నాయి. అయితే కొంతమంది ప్రజలు ఇది రాజకీయ కోణంలో చూస్తున్నారు. ఇంకా ఎన్నికలకు ఏడాది ఉండగా ఇప్పుడే వీరు రాజకీయం చేస్తున్నరంటూ వాపోతున్నారు. ప్రజారోగ్యం గాలికొదిలేసి నాయకులు రాజకీయం చేయడమేమిటని ప్రశ్నిస్తున్నారు. గత 25 సంవత్సరాలుగా ఉన్న కనకాలపేట డంపింగ్‌యార్డును తాత్కాలికంగా మూసివేశారు. ఇతర ప్రాంతాల నుంచి తీసుకువచ్చిన చెత్తవేయవద్దంటూ స్థానికులు ఆందోళన చేయడంతో గత నాలుగురోజులుగా ఏ చెత్త ట్రాక్టర్‌ను లోనికి వెళ్లనీయకుండా నిలువుదలచేశారు. ఈ డంపింగ్ యార్డును ఇక్కడ నుంచి తొలగించాలన్నది వారి డిమాండు. ఎన్నికలు వచ్చే సమయానికి సమస్యను పరిష్కారిస్తామని హామీ ఇవ్వడం, తర్వాత పట్టించుకోవడం లేదని వారి ఆరోపణ. గతంలో ఈ డంపింగ్ యార్డు తరలింపు ప్రయత్నాలు చేసినా ఇతర ప్రాంత ప్రజల వ్యతిరేకతతో ముందుకుసాగలేదు. స్థానిక ఎమ్మెల్యే డంపింగ్ యార్డులో చెత్త తీసుకురావద్దని చెప్పడంతో తాత్కాలికంగా అక్కడి సమస్య పరిష్కారం అయింది. కానీ చెత్త ఎక్కడ వేయాలో చెప్పకపోవడంతో సమస్య మరింత మొదటికొచ్చింది. పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ఎవ్వరికి ఇబ్బందులు లేనిచోటుకి డంపింగ్ యార్డును తరలించాలని కొంత ప్రయత్నం చేసినా ఆ ప్రాంత ప్రజల వ్యతిరేకతతో ఫలవంతం కాలేదు. ప్రస్తుతం యానాంలో అపారిశుధ్య పరిస్థితులను చక్కదిద్దాలని ప్రజలు కోరుతున్నారు. లేదంటే అనారోగ్య పరిస్థితులు దాపురిస్తాయని స్థానిక ప్రజలు ఆందోళన చెందుతున్నారు.


అశ్విని

ప్రకృతి వ్యవసాయంతో తల్లినయ్యా!

70 సెంట్ల నేలలో అద్భుతాలు సృష్టిస్తున్న అశ్విని

(కాట్రేనికోన-ఆంధ్రజ్యోతి)

కాట్రేనికోన మండలం పల్లంకుర్రుకు చెందిన 32ఏళ్ల గెద్దాడి అశ్విని బీఏ, బీఈడీ చదివింది. ఆమెకున్నది కేవలం 20సెంట్ల నేల మాత్రమే. మరో 50 సెంట్లు కౌలుకు తీసుకుని ప్రకృతి వ్యవసాయం చేసి అద్భుతాలు సృష్టించింది. నేలను కాపాడుకుంటే... నేల మనల్ని కాపాడుతుందని అశ్విని అంటోంది. పంట మార్పిడి ద్వారా భూసారాన్ని రక్షించుకోవచ్చని నిరూపించింది. రైతులు ప్రకృతి సాగు విధానాలను అవలంబించాలని ఆమె కోరుతున్నారు. సేంద్రియ వ్యవసాయంపై నాగపూర్‌లో జరిగిన జాతీయ సదస్సులో ఉత్తమ అవార్డు అందుకున్న అశ్వినితో 'ఆంధ్రజ్యోతి' ముచ్చటించింది. వివరాలు ఆమె మాటల్లోనే..

ప్రకృతిని గుర్తించి వ్యవసాయం చేస్తే అంతా మేలే జరుగుతుంది. మాది వ్యవసాయ కుటుంబం. కేవలం 20 సెంట్లు నేల ఉంది. మరో 50 సెంట్లు కౌలుకు తీసుకుని ప్రకృతి వ్యవసాయం ప్రారంభించాను. వరి, కాయగూరలు, ఆకు కూరలు... ఇలా వివిధ రకాలు సాగు చేస్తుంటాను. 2019 నుంచి ఆర్గానిక్ సాగు మొదలుపెట్టాను. కషాయాలు, జీవామృతాలు వంటి సహజ పద్ధతులతో చీడపీడలు నివారణ, సేంద్రియ ఎరువుల ద్వారా భూసార పరిరక్షణ చేస్తూ తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు తీస్తుంటాను. పంట మార్పిడిద్వారా నేల సారాన్ని పెంచుకుంటూ వస్తున్నాను. గట్లపై కాయగూరలు పండిస్తుంటాను. ఆకుకూరలు పెంచి విక్రయిస్తుంటాను. అంగన్వాడీ కేంద్రాల ఆవరణలో ఆకుకూరలు, కాయగూరలు పెంచడం అలవాటైంది. ప్రతి ఆదివారం కాట్రేనికోన మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆకుకూరలు, కాయగూరలు విక్రయిస్తాను. నాకు మూడేళ్ల పాప ఉంది. మా వారు కూడా వ్యవసాయమే చేస్తుంటారు. ఎప్పటికప్పుడు సేంద్రియ సాగులో ప్రయోగాలు, ఫలితాలపై డాక్యుమెంటేషన్ చేసి, వ్యవసాయాధికారులకు పంపుతాను. నాకు జాతీయ స్థాయిలో ఉత్తమ అవార్డు రావడం చాలా ఆనందంగా ఉంది. అందుకు నాకు సహకరించిన ఈవీసీ విజయకుమార్, డీపీఎం లక్ష్మానాయక్, డివిజన్ ఇన్‌చార్జి రమేష్, ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి ధన్యవాదాలు. మరి కొందరు రైతులను సేంద్రియ సాగు చేసేలా ప్రోత్సహిస్తున్నాను.

> నాకు థైరాయిడ్, పీసీవోడీ సమస్యలున్నాయని... గర్భధారణ కష్టమని వైద్యులు తేల్చేశారు. అప్పుడు నా సమస్యను సేంద్రియ వ్యవసాయమే పరిష్కరించింది. సేంద్రియ సాగు ద్వారా పండించిన ఆహారం మాత్రమే తినడంవల్ల గర్భకోశ సమస్యలు పరిష్కారమయ్యాయి.

> “కుగ్రామంలో జన్మించింది. ప్రకృతిని నమ్మింది. నేలను సంరక్షించుకుంటే ఆరోగ్యానికి రక్షణ కలుగుతుందని నిరూపించింది. సత్ఫలితాలు సాధించింది. జాతీయ అవార్డు సాధించి చరిత్ర సృష్టించింది. జాతీయ సేంద్రియ ప్రకృతి వ్యవసాయ కేంద్రం, భారత ప్రభుత్వ వ్యవసాయ రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ సంయుక్తంగా ఫిబ్రవరి 23, 24 తేదీల్లో నాగపూర్‌లో సేంద్రియ వ్యవసాయంపై జాతీయ సదస్సు నిర్వహించాయి. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయంలో మొత్తం 15 జాతీయ పురస్కారాలు అందించగా అందులో ఏడు మన రాష్ట్ర రైతులకే దక్కడం విశేషం. ఇందులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు చెందిన మహిళకు కూడా పురస్కారం దక్కింది.”

- నేలను రక్షించి ఆరోగ్యాన్ని కాపాడుకుందాం
- ఆరోగ్యంగా ఉండాలంటే భూమిని రక్షించుకోవాలి
- ప్రకృతి వ్యవసాయానికి రైతులు ముందుకు రావాలి
- జాతీయ స్థాయి పురస్కార గ్రహీత అశ్విని పిలుపు


అశ్విని అందుకున్న జాతీయ అవార్డు, ప్రశంసాపత్రం


Govt. of India
Ministry of Agriculture & Farmers Welfare
Department of Agriculture & Farmers Welfare
क्षेत्रीय जैविक एवं प्राकृतिक खेती केंद्र
Regional Centre for Organic & Natural Farming
Certificate
This is certified that Mr./Ms./Dr./Prof./ G. ASWANI, KONASEEMA NATURAL FARMING FARMER, APOUP-AMSS
has successfully participated in National Seminar cum Exhibition on Organic/Natural Farming organized by RCONF, Nagpur during 22-23 February, 2025.
Date: 23.02.2025
Place: Nagpur
Dr. Praveen K. Varda, JSO & Coordinator National Seminar
Dr. A. S. Rajput, Regional Director


వరిచేల గట్లపై కూరగాయల సాగు


కాట్రేనికోన మండల పరిషత్ కార్యాలయం వద్ద కూరగాయల స్టాల్‌లో అశ్విని


కేరళ స్ట్రైకర్స్, ఐబీ చెన్నై జట్ల క్రీడాకారుల మధ్య పోరు

జోరుగా... హుషారుగా వాలీబాల్ పోటీలు

- పరిశీలించిన రాష్ట్ర వాలీబాల్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు
- టోర్నమెంటు నిర్వహణ తీరుపై ప్రశంసలు



ఉప్పలగుప్తం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లి హైస్కూలు క్రీడా మైదానంలో జరుగుతున్న అరిగెల శ్రీరంగయ్య జాతీయ వాలీబాల్ పోటీలు శుక్రవారం మూడో రోజుకు చేరుకున్నాయి. రాష్ట్ర వాలీబాల్ అసోసియేషన్ కార్యవర్గం వాలీబాల్ కోర్టును పరిశీలించింది. పోటీల నిర్వహణ తీరుపై ఆటగాళ్లను, ప్రేక్షకులను అడిగి తెలుసుకుంది. టోర్నమెంటు అధ్యక్షుడు దేశంశెట్టి వెంకటలక్ష్మీ నారాయణ, ప్రధాన కార్యదర్శి అరిగెల నరేష్, కార్యనిర్వాహక కార్యదర్శిగొలకోటి ఫణీంద్రకుమార్‌తో అసోసియేషన్ సభ్యులు చర్చించారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రవిరాజు, కోశాధికారి బ్రహ్మాజీ టోర్నమెంటు నిర్వహణ తీరును ప్రశంసించారు. కాగా మొదటి మ్యాచ్ కేరళ స్ట్రైకర్స్, ఐబీ చెన్నై మధ్య నువ్వా... నేనా అన్న రీతిలో జరిగింది. బెస్ట్ ఆఫ్ ఫైవ్‌లో విజయం నిర్ధారించారు. 3-2 తేడాతో కేరళ స్ట్రైకర్స్ విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో బెంగళూరు, జీఎస్టీ (ముంబయి) జట్ల మధ్య జరిగింది. వరుసగా మూడు సెట్లు గెలుచుకుని జీఎస్టీ విజేతగా నిలిచింది.


తలపడుతున్న జీఎస్టీ (ముంబై), బెంగళూరు జట్ల క్రీడాకారులు

ఉత్సాహభరితంగా..

● ముగిసిన ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్

- రెండువారాల పాటు కాకినాడలో కొనసాగిన పోటీలు
- పురుషుల విభాగంలో విజేత ఢిల్లీ సెంట్రల్ సెక్రటేరియట్
- మహిళల విభాగంలో విజేత ఒడిశా సెక్రటేరియట్


పురుషుల విభాగంలో : కాకినాడ క్రీడా మైదానంలో తలపడుతున్న హైదరాబాద్ వర్సెస్ ఢిల్లీ


మహిళల విభాగంలో : ఒడిశా వర్సెస్ ఢిల్లీ

కలెక్టరేట్ (కాకినాడ), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా క్రీడామైదానంలో రెండు వారాలుగా జరుగుతున్న ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ శుక్రవారం ముగిసింది. శుక్రవారం జరిగిన ఫైనల్స్‌లో పురుషుల విభాగంలో ఢిల్లీ సెంట్రల్ సెక్రటేరియట్ టీమ్, మహిళల విభాగంలో ఒడిశా సెక్రటేరియట్ టీమ్‌లు విజేతలుగా నిలిచాయి. ముగింపు వేడుకలకు ముఖ్యఅతిథిగా ఏపీ, తెలంగాణ రీజియన్ ఇన్‌కమ్ ట్యాక్స్ డైరెక్టర్ జనరల్ ఆనంద్ రాజేశ్వర్ బైవార్, అర్జున, రాజీవ్ గాంధీ ఖేల్‌రత్న అవార్డుల విజేత, ప్రముఖ హాకీ క్రీడాకారుడు ధనరాజ్ పిళ్లై హాజరై విజేతలకు, రన్నర్ అప్ టీమ్‌లకు ట్రోఫీలను అందజేశారు. అనంతరం ముఖ్య అతిథి ఆనంద్ రాజేశ్వర్ బైవార్ మాట్లాడుతూ తొలిసారి ఆతిథ్యం ఇచ్చి టోర్నమెంట్‌ను విజయవంతం చేసిన కాకినాడ జిల్లా యంత్రాంగానికి అభినందనలు తెలిపారు. దేశంలో వివిధ రాష్ట్రాల నుంచి ఉత్సాహంగా వచ్చి క్రీడా స్ఫూర్తితో ఉత్తమ నైపుణ్యాలను ప్రదర్శించిన సివిల్ సర్వీసెస్ ఉద్యోగులను అభినందించారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడలతో మంచి శారీరక ఆరోగ్యం, మానసిక దృఢత్వం చేకూరుతుందని పేర్కొన్నారు. మరో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ధనరాజ్ పిళ్లై మాట్లాడుతూ దేశంలో క్రికెట్ తరహాలో హాకీ క్రీడలకు క్రేజ్ లేనప్పటికీ యువత ఉత్సాహంగా పాల్గొనడం ఎంతో సంతోషమన్నారు. హాకీ క్రీడాకారులు నిరంతరం ప్రాక్టీస్ చేసి తమ నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, జేఎన్‌టీయూకే వైస్ చాన్సలర్ సీఎస్ఆర్‌కే ప్రసాద్, విశాఖపట్నం ఇన్‌కమ్‌టాక్స్ ప్రిన్సిపల్ కమిషనర్ రాజేంద్ర కుమార్, కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, అసిస్టెంట్ కలెక్టర్ భావన తదితరులు పాల్గొన్నారు. పోటీలు ముగిసిన అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.


వేదికపై మాట్లాడుతున్న భారత హాకీ జట్టు మేనేజర్ ధనరాజ్ పిళ్లై



వేదికపై మాట్లాడుతున్న ఆనంద్ రాజేశ్వర్(డైరక్టర్ ఆఫ్ లింగం ట్యాక్స్)


విజేతగా నిలిచిన ఒడిశా మహిళా జట్టు


మొదటి స్థానంలో నిలిచిన ఢిల్లీ పురుషుల జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న నిర్వాహకులు


రెండో స్థానంలో నిలిచి ట్రోఫీ అందుకుంటున్న ఢిల్లీ మహిళల జట్టు


సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న దృశ్యం

టోర్నమెంట్‌లో విజేత జట్లు ఇవే..

మొదటి స్థానం: సెంట్రల్ సెక్రటేరియట్,
రెండో స్థానం: ఆర్ఎస్బీ హైదరాబాద్,
మూడోస్థానం: హర్యానా సెక్రటేరియట్
(పురుషుల విభాగం)

మొదటిస్థానం: ఒడిశా సెక్రటేరియట్,
రెండోస్థానం: సెంట్రల్ సెక్రటేరియట్,
మూడోస్థానం: హర్యానా సెక్రటేరియట్
(మహిళల విభాగం)

టోర్నమెంట్‌లో బహుమతులు పొందిన క్రీడాకారులు:
మహిళలు: రీతురాణా, జోసఫ్ ప్రధాన్, మౌనిక వైంగేడ్, కేఎల్ నాగలక్ష్మీ
పురుషులు: విశాల్‌సింగ్, ప్రమోద్, సూర్యప్రకాష్, దీపక్ షైనీ
బెస్ట్ టోర్నమెంట్ ఆఫ్ ది ప్లేయర్స్: వినయ్‌రాణా (సెంట్రల్ సెక్రటేరియట్), సోనికా(సెంట్రల్ సెక్రటేరియట్). దీనిలో భాగంగా వారికి ప్రశంసాపత్రాలు అందించారు.

మూడో స్థానం కోసం రసవత్తర పోరు

మహిళల ఫైనల్స్: ఒడిశా సెక్రటేరియట్ జట్టు, సెంట్రల్ సెక్రటేరియట్ జట్లు తలపడగా ఒడిశా సెక్రటేరియట్ జట్టు 4-2 తేడాతో గెలుపొందింది. మహిళల మూడో స్థానం కోసం జరిగిన పోటీల్లో హర్యానా సెక్రటేరియట్ జట్టు, ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్ జట్టు తలపడగా హర్యానా 4-2 తేడాతో గెలిచింది.

పురుషుల ఫైనల్స్: సెంట్రల్ సెక్రటేరియట్ జట్టు, ఆర్ఎస్బీ హైదరాబాద్ జట్లు తలపడగా సెంట్రల్ సెక్రటేరియట్ జట్టు 4-2 తేడాతో గెలిచింది. పురుషుల మూడోస్థానం కోసం జరిగిన పోటీల్లో హర్యానా సెక్రటేరియట్ జట్టు, ఒడిశా సెక్రటేరియట్ జట్లు తలపడగా హర్యానా సెక్రటేరియట్ 7-2 తేడాతో గెలిచింది.

గోదావరిలో బోట్ రేస్


బోట్ రేస్‌లో పాల్గొన్న బోట్లు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం గోదావరి నదిలో బోట్ రేస్ అట్టహాసంగా జరిగింది. నదీజలాలపై అవగాహన కల్పించడానికి జాతీయ జలవనరుల శాఖ, జలశక్తి విభాగం, నదీసంరక్షణ సంస్థ ఆదేశాల మేరకు తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం గోదావరిలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఈ కార్యక్రమం జరిగింది. దీనిని కమిషనర్ కేతన్ గార్గ్ జెండా ఊపి ప్రారంభించారు. పుష్కరాలరేవు ఎదురుగా ఉన్న గోదావరి లంక నుంచి 15 నావలు ఈ పోటీలో పాల్గొన్నాయి. లంక నుంచి పుష్కరాలరేవుకు ఈ రేస్ నిర్వహించారు. ఇంజన్ బోట్లు కాకుండా ఏతం వేసే బోట్లను పోటీలో దింపారు. సుమారు గంట పాటు జరిగిన పోటీలో ప్రథమ స్థానంలో నాతి పోసయ్య, ద్వితీయ స్థానంలో మల్లాడి సుబ్బన్న, తృతీయ స్థానంలో పోతాబత్తుల నాగరాజు నిలిచారు. ప్రథమ బహుమతిగా రూ25వేలు, ద్వితీయ బహుమతిగా రూ15వేలు. తృతీయ బహుమతిగా రూ10వేలు నగదును సాయంత్రం పుష్కరాలరేవులో జరిగిన ముగింపు కార్యక్రమంలో అందించారు. గోదావరి జలల పరిరక్షణ కోసం ఈ బోట్ రేస్‌ను ఏర్పాటు చేశామని కమిషనర్ చెప్పారు.


బోట్ రేస్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్



నేటి నుంచి కొత్త మోటార్ వెహికిల్ చట్టం అమల్లోకి

లైసెన్సు లేకపోతే రూ.5వేలు

సెల్‌ఫోన్‌తో డ్రైవింగ్‌కు రూ.10వేలు జరిమానా

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)



శనివారం నుంచి కేంద్ర ప్రభుత్వం కొత్త మోటారు వెహికిల్ చట్టం 'న్యూ సెంట్రల్ మోటార్ వెహికిల్ యాక్ట్-1988(సవరణ 2019)' అమల్లోకి తీసుకొస్తోంది. దీని ప్రకారం నిబంధనలు కఠినంగా ఉంటాయి. జరిమానాలు రూ.వెయ్యి నుంచి ప్రారంభమవుతాయి. డ్రైవింగ్ లైసెన్సు రద్దుకూ వెనుకాడరు. ఇలా ఒకసారి డ్రైవింగ్ లైసెన్సు రద్దు చేస్తే మళ్లీ పునరుద్ధరించడం చాలా కష్టమైన పని. లైసెన్సు లేకపోతే రూ.5వేలు, సెల్‌ఫోన్‌తో డ్రైవింగ్‌కు రూ.10వేలు జరిమానా విధిస్తారు. మార్చి 1 నుంచి నూతన చట్ట ప్రకారం జరిమానాలు విధించడం జరుగుతుందని తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ తెలిపారు. రోడ్డు భద్రతా నిబంధనలు పాటించి తీరాల్సిందేనని చెప్పారు. వాహనాలను ఆల్ట్రేషన్ చేయడం, ఇష్టానుసారం నంబరు ప్లేట్లు వేసుకోవడం, అసలు నెంబరు లేకుండా పేరు రాసుకోవడం, సవ్యంగా డ్రైవింగ్ చేసే వారికి కూడా ఇబ్బంది కలిగే విధంగా, ప్రమాదకరంగా డ్రైవింగ్ చేయడం, నంబరు ప్లేట్లు లేకపోవడం వంటి వాటిపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తామన్నారు. హెల్మెట్ లేకపోతే చలానాలు తప్పవని ఆయన హెచ్చరించారు. ద్విచక్రవాహనంపై ఇద్దరు మాత్రమే ప్రయాణించాలని, ఇద్దరికీ హెల్మెట్లు ఉండాలన్నారు. రాజమహేంద్రవరం నగరంలో ట్రాఫిక్ సీఐలు మహమ్మద్ నబీ, చింతా సూరిబాబు సిబ్బందితో ప్రత్యేక తనిఖీలు చేపడతారని చెప్పారు. కొత్త చట్ట ప్రకారం చలానాలు విధించడమే కాకుండా అక్కడికక్కడే జరిమానా కట్టించుకునే విధంగా ఏర్పాట్లు చేశామని ఆయన పేర్కొన్నారు. పిల్లలకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులు చిక్కుల్లో పడతారన్నారు.

జనసేన ఆవిర్భావ వేడుకలకు విస్తృత ఏర్పాట్లు : మంత్రి నాదెండ్ల


జనసేన ఆవిర్భావ వేడుకల సభా స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి మనోహర్, ఇతర నేతలు

పిఠాపురం/పిఠాపురం రూరల్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం వేదికగా జరగనున్న జనసేన పార్టీ ఆవిర్భావ వేడుకలకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి, జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ తెలిపారు. పిఠాపురం మండలం చిత్రాడ శివారు ఎస్‌బీ వెంచర్స్‌లో మార్చి 14న జరిగే జనసేన ఆవిర్భావ వేడుకల సభాస్థలిని ఆయన శుక్రవారం రాత్రి పరిశీలించారు. ప్రధాన వేదిక నిర్మాణం, గ్యాలరీల ఏర్పాటు తదితర అంశాలకు సంబంధించి పార్టీ కార్యక్రమాల నిర్వహణ కమిటీకి సూచనలు చేశారు. మహిళలు ఏ ఇబ్బంది లేకుండా నేరుగా సభాస్థలికి చేరుకునే ఏర్పాట్లు చేయాలని సూచించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే లక్షలాది మంది పార్టీ శ్రేణులకు అన్నిరకాల సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. సభ కారణంగా ఎవరికి ఇబ్బంది కలగకుండా చేయాల్సిన జాగ్రత్తలపై సూచనలు ఇచ్చారు. సార్వత్రిక ఎన్నికల్లో విజయం అనంతరం చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో శాసనమండలి ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ఛైర్మన్ తోట సుధీర్, కుడా ఛైర్మన్ తుమ్మల బాబు, జనసేన పిఠాపురం సమన్వయకర్త మర్రెడ్డి శ్రీనివాసరావు, పార్టీ కార్యక్రమాల నిర్వహణ కమిటీ ఛైర్మన్ కల్యాణం శివ శ్రీనివాస్, నాయకులు వై.శ్రీనివాస్, బోడపాటి శివదత్, తలాటం సత్య, మండలి రాజేష్, తోట సత్యనారాయణ, చల్లా లక్ష్మీ, మురాలశెట్టి సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. కాగా ఆవిర్భావ వేడుకల సభ నిర్వహణ ఏర్పాట్లుకు శనివారం సాయంత్రం 4గంటలకు భూమి పూజ జరగనున్నది.

శాస్త్ర, సాంకేతిక రంగాల్లో రాణించాలి : వీసీ

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): సమాజ శ్రేయస్సు కోసం విజ్ఞానం వైపు అడుగులు వేసే మహనీయులను ఆదర్శంగా తీసుకుని యువత శాస్త్ర, సాంకేతిక రంగాల్లో రాణించాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. తూర్పు గోదావరి జిల్లా నన్నయ విశ్వవిద్యాలయంలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన వీసీ మాట్లాడుతూ విక్షిత్ భారత్ కోసం సైన్స్ అండ్ ఇన్నోవేషన్-2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్‌గా మేధోపరమైన విజన్‌తో ముందుకు సాగాలన్నారు. మరో అతిథి కోస్తా ఆంధ్ర రేంజ్ డీఐజీ ఎం.ఆర్. రవికిరణ్ మాట్లాడుతూ ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చెప్పినట్టు సినిమాను సినిమాలాగే చూడాలని, నిజజీవితంలో వాటిని అన్వయించుకోకూడదని చెప్పారు. ఈజీమని కోసం ఎవరూ ఆశపడకూడదని, అటువంటి వారు జైళ్లో మగ్గుతున్నారని చెప్పారు. గంజాయి మత్తులో తల్లిదండ్రులను చంపిన వారు జైళ్లల్లో ఉన్నారని, గంజాయి సంబంధిత సమాచారాన్ని 1972 నెంబరుకు తెలియజేయాలన్నారు. సీఎస్ఐఆర్-ఐఐసీటీ హైదరాబాద్ ప్రధాన శాస్త్రవేత్త చంద్రశేఖరం మలపాక ప్రతీ ఏడాది సైంటిఫిక్ ఆడిట్ నిర్వహించాలన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాలలో వస్తున్న మార్పులపై చర్చలు జరగాలని చెప్పారు. అనంతరం ఆచార్య మురళీకృష్ణ, కె.నూకరత్నం రాసిన స్పాటియల్ అనాలసిస్ అండ్ జియో విజువలైజేషన్ పుస్తకాన్ని వీసీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు జ్ఞాపికలు, ధృవపత్రాలను అందజేసారు. కెమిస్ట్రీ విద్యార్థి బద్రి వేసిన సర్ సీవిరామన్, అబ్దుల్ కలామ్ చిత్రపటాలను వీసీ ఆవిష్కరించి సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ప్రిన్సిపాల్ పి.విజయనిర్మల, డీన్ ఆచార్య వై.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. తొలుత నన్నయ విగ్రహానికి, సర్ సీవీరామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.


రామన్ చిత్రపటానికి, నన్నయ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన వీసీ, అతిథులు

కనుల పండువగా కుక్కుటేశుని తెప్పోత్సవం

వైభవంగా శ్రీపుష్పోత్సవం, ముగిసిన కల్యాణోత్సవాలు



పిఠాపురం పాదగయ పుష్కరిణిలో హంస వాహనంపై కుక్కుటేశుని తెప్పోత్సవం, బాణసంచా కాల్పుల దృశ్యం

పిఠాపురం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ పుష్కరిణిలో భక్తుల శివనామస్మరణ మధ్య కుక్కుటేశుడు అమ్మవారితో కలిసి హంసవాహనంపై విహరించారు. శ్రీపుష్పోత్సవం సందర్భంగా విశేష అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దక్షిణకాశీగా విరాజిల్లుతున్న పిఠాపురం పాదగయ క్షేత్రంలో వేంచేసి ఉన్న రాజరాజేశ్వరీ సమేత ఉమా కుక్కుటేశ్వర స్వామి కల్యాణోత్సవాలు శుక్రవారం రాత్రితో ముగిశాయి. చివరి రోజు కుక్కుటేశుని తెప్పోత్సవం కనులపండువగా జరిగింది. స్వామి,అమ్మవార్ల ఉత్సవ మూర్తులను హంస వాహనంపై ఉంచి తెప్పోత్సవం నిర్వహించారు. తెప్పోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు అధికంగా తరలి వచ్చారు. పాదగయలో జరుగుతున్న కల్యాణోత్సవాల్లో భాగంగా కుక్కుటేశ్వరస్వామికి ఉదయం స్వామికి అభిషేకం, రాజరాజేశ్వరీదేవికి కుంకుమార్చనలు జరిగాయి. స్వామి, అమ్మవారికి త్రిశూల స్నానం జరిపించారు. రాత్రి పదిగంటలకు శ్రీపుష్పోత్సవం నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు ఆలయ అర్చకులు విశేష అలంకరణ చేశారు. పూజల్లో పాల్గొన్న మహిళలకు దంపత తాంబూలాలు అందజేశారు. అనంతరం ఏకాంతసేవాగానం జరిగింది. కార్యక్రమాల్లో ఆలయ ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్, చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ రామ్మోహనరావు పాల్గొన్నారు.

ప్రత్యేక ఆకర్షణగా బాణసంచా కాల్పులు

పిఠాపురంలోని ఉప్పాడ సెంటర్‌లో గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకూ కాల్చిన బాణసంచా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కుక్కుటేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా నిర్వహించిన రథోత్సవంలో రథాన్ని ఉప్పాడ సెంటర్‌లో నిలిపిన అనంతరం 4 గంటల పాటు బాణసంచా కాల్చారు. మిరుగొట్లు గొలిపే బాణసంచా కాల్పులను తిలకించేందుకు భక్తులు భారీసంఖ్యలో తరలివచ్చారు.

భీమేశ్వరునికి త్రిశూల స్నాన పూజలు


పుష్కరిణిలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

సామర్లకోట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పంచారామ పుణ్యక్షేత్రమైన సామర్లకోట కుమార రామ భీమేశ్వరునికి త్రిశూల స్నాన పూజలు శుక్రవారం వేదపండితుల వేదమంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా నిర్వహించారు. మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయ ఈవో నీలకంఠం ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులను పండితులు సోమేశ్వరశర్మ నేతృత్వంలో చెరుకూరి రాంబాబు, రాజగోపాలశర్మ, అంజిబాబు, వెంకన్న వేదమంత్రోచ్ఛారణల మధ్య ఆలయ పుష్కరిణి వద్దకు తోడ్కొని వచ్చారు. త్రిశూల స్నానం, తీర్థపుసేవ పూజలు నిర్వహించారు.

డెల్టా కాలువలకు నీటి విడుదల పెంపు

ధవళేశ్వరం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రబీ అవసరాల కోసం డెల్టా కాలువలకు నీటి విడుదలను పెంచి విడుదల చేస్తున్నారు. కాటన్ బ్యారేజ్ నుంచి తూర్పు డెల్టా ప్రధాన పంట కాలువకు 2650 క్యూసెక్కులు, మధ్య డెల్టా ప్రధాన పంటకాలువకు 1720 క్యూసెక్కులు, పశ్చిమడెల్టా ప్రధాన పంట కాలువకు 4600 క్యూసెక్కులు, 8970 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. గోదావరిలో నీటి లభ్యత 8328 క్యూసెక్కులుగా ఉండగా, ధవళేశ్వరం వద్ద గోదావరి నీటి మట్టం 9.05 అడుగులుగా నమోదైంది.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఇద్దరు యువకుల దుర్మరణం


మరణించిన ఆకాష్‌రెడ్డి, జయఅభినవ్ (ఫైల్‌ఫొటోలు)

ఐ.పోలవరం/ముమ్మిడివరం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం 216 జాతీయ రహదారిపై పాతయింజరం పోలీసుస్టేషన్ సమీపంలో గురువారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. యానాం నుంచి స్పోర్ట్స్ బైక్‌పై వస్తున్న వారిని గుర్తుతెలియని వాహనం ఢీ కొనడంతో ఈ ప్రమాదం జరిగింది. మృతులిద్దరూ ముమ్మిడివరం మండలానికి చెందిన వారు కావడంతో ఆ ప్రాంతంలో తీవ్ర విషాద చాయలు నెలకొన్నాయి.

మృతులలో ఒకరు ముమ్మిడివరం టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ వీధికి చెందిన దొమ్మేటి జయఅభినవ్ (17) కాగా మరొకరు కర్రివానిరేవు పంచాయతీ పరిధిలోని బూరుగుపేటకు చెందిన మాట్టా ఆకాష్‌రెడ్డి (21). దొమ్మేటి అచ్యుత వీరవెంకటసత్యనారాయణ-సరోజిని దంపతులకు దొమ్మేటి జయఅభినవ్ ఏకైక సంతానం. పదో తరగతి వరకు చదివి ప్రస్తుతం ఖాళీగా ఉంటున్నాడు. లేకలేక కలిగిన సంతానం ఒక్కగానొక్క కుమారుడు. అభినవ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో తల్లిదండ్రులు రోదిస్తున్నారు. ఒక్కగానొక్క కుమారుడు ఇక లేడన్న సంగతిని జీర్ణించుకోలేకపోతున్నారు. మట్టా రాహుల్-సుభాషిణి దంపతుల పెద్ద కుమారుడు మట్టా ఆకాష్‌రెడ్డి. డిప్లమో చేసి ప్రస్తుతం ముమ్మిడివరంలోని ప్రైవేటు కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. చేతికందివచ్చిన కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృత్యువాతకు గురవ్వడంతో తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే ఐ.పోలవరం పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని కుటుంబ సభ్యులకు సమాచారమందించారు. మృతదేహాలను ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సీసీ ఫుటేజ్ ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ మల్లిఖార్జునరెడ్డి తెలిపారు.

ధర్మవరంలో వృద్ధుడి మృతి

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరం జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగిన ప్రమాదంలో వృద్ధుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మవరానికి చెందిన రాయి నూకరాజు హైస్కూలు రోడ్డు జంక్షన్‌లో హైవే దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహానికి స్థానిక ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. ఎస్ఐ లక్ష్మీకాంతం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


రోడ్డుపై మృతదేహాలు

సత్యనారాయణస్వామి ఆలయంలో చోరీ

8కిలోల వెండి ఆభరణాలు అపహరణ

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం నవరప్పాలెం శ్రీరమా సత్యనారాయణస్వామి ఆలయంలో దొంగలు పడి 8 కిలోల వెండి ఆభరణాలను అపహరించుకుపోయారు. ఆలయ పూజారి దొంతికుర్తి శ్రీనివాస్ శుక్రవారం ఉదయం ఆలయం తలుపులు తెరిచేందుకు వెళ్లారు. అప్పటికే తలుపులు తెరచి ఉండడాన్ని గుర్తించి స్థానిక పెద్దలు, అధికారులకు సమాచారం అందించారు. తాలూకా ఎస్ఐ వై.శేఖర్‌బాబు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని ఉన్నతాధికారులకు వివరించారు. క్రైమ్ సీఐ గజేంద్రకుమార్, పట్టణ సీఐ పి.వీరబాబు, తాలూకా సీఐ డి.ప్రశాంత్‌కుమార్ ఆలయం వద్దకు చేరుకున్నారు. ఆలయానికి ఉన్న నాలుగు ప్రధాన ద్వారాల తాళాలను పగులకొట్టి గర్భాలయంలోని 8కిలోల వెండి ఆభరణాలను చోరులు అపహరించుకుపోయినట్టు గుర్తించారు. అప్పటికే క్యూస్‌టీమ్, డాగ్ స్క్వాడ్‌ను రప్పించారు. వేలిముద్రలను సేకరించారు. ఆలయం వద్ద నుంచి డాగ్‌స్క్వాడ్ కిలోమీటరు దూరంలో ఉన్న కేతావారిపాలెం వరకు వెళ్లి అక్కడ ఆగిపోయింది. ఆలయ పూజారి దొంతికుర్తి శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాలూకా ఎస్ఐ శేఖర్‌బాబు కేసు దర్యాప్తు చేపట్టారు. స్థానికంగా ఎవరైనా దొంగతనానికి పాల్పడ్డారా లేక బయటి నుంచి దొంగలు వచ్చారా అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ ప్రశాంత్‌కుమార్ తెలిపారు. ఆలయంలో మిగిలిన వెండి ఆభరణాలు, బంగారు ఆభరణాలు యథావిధిగానే ఉన్నాయని ఆలయ పూజారి, గ్రామపెద్దలు తెలిపారు.


చోరీ జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీఐలు వీరబాబు, గజేంద్రకుమార్

పోలవరం ముంపు నుంచి ఆదుకోవాలి

వీఆర్‌పురం మండలం వడ్డిగూడెం వాసుల ఆందోళన


ధవళేశ్వరం పోలవరం భూ సేకరణ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న వడ్డిగూడెం వాసులు

ధవళేశ్వరం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పోలవరం ముంపు నుంచి ఆదుకోవాలని, తమను నిర్వాసితులుగా గుర్తించి పునరావాసం కల్పించాలని, ఆర్అండ్‌ఆర్ ప్యాకేజీ అమలు చేయాలని అల్లూరి సీతారామరాజు జిల్లా వీఆర్‌పురం మండలం వడ్డిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని బీసీ కాలనీ వాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరంలోని పోలవరం భూసేకరణ కార్యాలయానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఆందోళన చేశారు. స్పెషల్ కలెక్టర్ ఎస్.సరళావందనంకు వినతిపత్రం అందజేసి తమ గోడును వెళ్లబోసుకున్నారు. అనంతరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ ఐఏఎస్ అధికారి వి.అభిషేక్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తామంతా వీఆర్‌పురం గ్రామం బీసీ కాలనీ వాసులమని, గత 60 ఏళ్లుగా వడ్డిగూడెం పంచాయతీలో ఇంటిపన్నులు చెల్లిస్తున్నామన్నారు. అయితే తమ ఇళ్లు ఇతర భూములు రేఖపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలో ఉన్నాయంటున్న అధికారులు ఆ కారణంతో తమ కాలనీలో ఉన్న 209 కుటుంబాలను ముంపు బారిన పడుతున్నట్టు గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ కాలనీ పరిధిలో 209 కుటుంబాలు ఉండగా 111 కుటుంబాలు లేడార్ సర్వేలో ఉన్నాయని మిగిలిన 98 కుటుంబాలు లేడార్ సర్వే కుటుంబాల్లో లేవని అధికారులు చెబుతున్నారని అయితే గోదావరి వరదలు వస్తే మొత్తం గ్రామం అంతా మునిగిపోతుందని ఫోటోలు ప్రదర్శించారు.

రేఖపల్లి రెవెన్యూ గ్రామానికి సంబంధం లేకుండా వీఆర్‌పురం బీసీ కాలనీలో ఉన్న 209 కుటుంబాలను ఒకే యూనిట్‌గా 41.15 కాంటూరులో చేర్చి ముంపు ప్రాంతంగా గుర్తించి గ్రామ సభలో తీర్మానించాలని కోరారు. స్ట్రక్చర్ వాల్యూ సర్వే చేయించాలని అధికారులను కోరారు. కాలనీలో కొంతభాగం ముంపు ప్రాంతంగా, మరికొంత భాగాన్ని ముంపు బారిన పడని ప్రాంతంగా గుర్తించడం తగదని పోలవరం పూర్తయితే శాశ్వతంగా ముంపునకు గురవుతామని ప్రభుత్వం చొరవతో పునరావాసం కల్పించాలని కోరారు.

కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడిగా కామన


కామన ప్రభాకరరావు

మండపేట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ఏడిదకు చెందిన ఏఐసీసీ సభ్యుడు కామన ప్రభాకరరావును నియమితులయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం మండపేట ఏడిద రోడ్డులో ఉన్న కాంగ్రెస్ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను 40 ఏళ్ల నుంచి కాంగ్రెస్‌లో పనిచేస్తున్నానని.. తనపై ఎంతో నమ్మకంతో కిసాన్‌సెల్ అధ్యక్షుడిగా నియమించినందుకు కాంగ్రెస్ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. రైతు సమస్యలపై రాష్ట్ర పర్యటన త్వరలోనే జరుగుతుందని, పీసీసీ అధ్యక్షురాలు షర్మిలారెడ్డిని కలిసిన తర్వాత ఉత్తరాంధ్ర నుంచి రైతు సమస్యలపై పోరాటం ఉంటుందని ఆయన చెప్పారు.

ఘనంగా సైన్స్ దినోత్సవం

కాట్రేనికోన,ఫిబ్రవరి28(ఆంధ్రజ్యోతి): చెయ్యేరు శ్రీశ్రీనివాసా ఇంజనీరింగు కళాశాలలో శుక్రవారం సైన్స్ దినోత్సవం నిర్వహించారు. సర్‌సీవీ రామన్ సేవలను వక్తలుగుర్తుచేశారు. విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసకుమార్, కరస్పాండెంట్ డీవీఎస్ఎస్ వర్మ, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

'పరిమితికి మించి తరలించరాదు'

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలించరాదని పట్టణ సీఐ పి.వీరబాబు పేర్కొన్నారు. రహదారి భద్రత-జీవితానికే రక్ష కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వాసర్ల గార్డెన్స్‌లో జిల్లాస్థాయి ఆటో యూనియన్ ప్రతినిధులతో ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు.

బడ్జెట్‌తో రాష్ట్రాభివృద్ధి ముందడుగు

ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ శుక్రవారం అసెంబ్లీ ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈబడ్జెట్ రాష్ట్ర అభివృద్ధికి, సంక్షేమానికి ఎంతో దోహదం చేస్తుందన్నారు. పాఠశాల విద్యకు అధిక ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. రాష్ట్ర బడ్జెట్ అన్నివర్గాలకు మేలు చేకూర్చేలా ఉందన్నారు. మత్స్యకార భరోసాకు దీపం పథకానికి రూ.2600 కోట్లు, తల్లికి వందనం కోసం రూ.9400 కోట్లు, ఎన్టీఆర్ భరోసా పింఛన్ల కోసం రూ.27,516 కోట్లు కేటాయించడం శుభ పరిణామని పలువురు పేర్కొన్నారు.

రైతు బడ్జెట్


తాడి నరసింహారావు, వ్యాపారవేత్త, ముమ్మిడివరం



వ్యవసాయ రంగానికి రూ.11,636 కోట్లు కేటాయించడం రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. పాఠశాల విద్యకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం, దీనివల్ల విద్యా ప్రమాణాలు మెరుగుపడతాయి. జలవనరుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చింది. అమరావతి నిర్మాణానికి రూ.600కోట్లు కేటాయించడం ద్వారా రాజధాని నిర్మాణం ముందుకుసాగుతుంది. దీని వల్ల రాష్ట్రానికి పెట్టుబడులు వచ్చే అవకాశం ఉంది. చేనేత, నాయీ బ్రాహ్మణులకు ఉచిత విద్యుత్, ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్ హర్షణీయం. అన్నదాత సుఖీభవకు రూ.630కోట్లు కేటాయింపు హర్షణీయం. ప్రభుత్వం ప్రవేశపెట్టి బడ్జెట్ వ్యవసాయం, విద్య రంగాలతో పాటు అన్నిరంగాలకు మేలు జరిగేలా ఉంది.

రాష్ట్ర బడ్జెట్ అసంతృప్తికరంగా ఉంది

ఇసుకపట్ల మంగాదేవి, వ్యవసాయ కూలీసంఘం నాయకురాలు, ముమ్మిడివరం



విద్యా, వైజ్ఞానిక, సామాజిక, సంక్షేమ పథకాలకు తగిన నిధులు కేటాయింపు లేదు. గత బడ్జెట్‌కు, ఈబడ్జెట్‌కి 2శాతం మాత్రమే పెరిగింది. ప్రస్తుత ధరలు పెరుగుతున్న దానిని బట్టి చూస్తే 2శాతం నిధులు సరిపోవు. రాబోయే రోజుల్లో ప్రజలపై భారాలు వేసేవిధంగా బడ్జెట్ ఉంది. గతంలో అంగన్‌వాడీ, ఆశ వర్కర్లకు ఇచ్చిన హామీలు తీర్చేలా ఈబడ్జెట్‌లో ఎక్కడా చూపలేదు. బడ్జెట్‌లో అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు, వ్యవసాయ కార్మికులకు అన్యాయం జరిగింది.

వేతన జీవులను విస్మరించిన బడ్జెట్


గుడే దుర్గాప్రసాద్, ముమ్మిడివరం సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు



వేతనాల కోసం పనిచేస్తున్న కార్మికులకు బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇవ్వలేదు. సాధారణంగా బడ్జెట్ ప్రవేశపెడుతున్నారంటే వేతనాలు పెరుగుతాయని ఎదురు చూసే వేతన జీవుల ఆశలను అడియాసలు చేశారు. బడ్జెట్‌లో కొన్ని పథకాల అమలుకు కేటాయింపు చేస్తున్నారు తప్ప జీతాల కోసం పనిచేసే కార్మికులకు బడ్జెట్‌లో నిధుల కేటాయింపు జరగలేదు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల మేరకు అంగన్‌వాడీలకు గ్రాడ్యుటీ అమలుచేసిన ఘనత తమదేనని చెప్పుకోవడం తప్ప ఆచరణలో కనిపించలేదు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్సీ ఐఆర్ ఊసే లేదు. వారికి చెల్లించాల్సిన బకాయిల ప్రస్తావన, కేటాయింపు లేదు. ఓపీఎస్ పునరుద్ధరణ గురించి లేదు. కార్మికులు వేతనాల కోసం, సంక్షేమం కోసం తగిన విధంగా బడ్జెట్ ప్రతిపాదనలో నిధులు కేటాయింపు లేదు.

రాష్ట్రాభివృద్ధికి ముందడుగు

గుబ్బల శ్రీనివాస్, సెంట్రల్ డెల్టా చైర్మన్, రాజోలు



అద్భుతమైన బడ్జెట్‌తో రాష్ట్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ముందు అడుగు వేసిందన్నారు. ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అసెంబ్లీలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన సందర్భంగా రూ.3.22లక్షల కోట్లతో అభివృద్ధి సంక్షేమమే ఎజెండాగా బడ్జెట్ కేటాయింపు జరిగిందన్నారు. సీఎం నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యంత్రి కొణిదెల పవ

రాష్ట్ర బడ్జెట్‌పై అభిప్రాయాలు..

న్‌కల్యాణ్‌ల ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో నడవడం ఖాయమన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని సమానంగా తీసుకువెళ్లేలా అన్నివర్గాల ప్రజలకు న్యాయం జరిగేలా బడ్జెట్ ఉందన్నారు. వ్యవసాయ బడ్జెట్ రూ.48వేల కోట్లు, జలవనరుల శాఖకు రూ.18,020 కోట్లు, వ్యవసాయశాఖ రూ.11,632 కోట్లు కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

జనరంజక బడ్జెట్


మంగెన భూదేవి, తెలుగుదేశంపార్టీ రాష్ట్ర మహిళా కార్యదర్శి, మలికిపురం



అంసెబ్లీలో ప్రవేశపెట్టి రాష్ట్ర బడ్జెట్ అన్నివర్గాలకు మేలు చేకూర్చేలా ఉందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మహిళా కార్యదర్శి మంగెన భూదేవి అన్నారు. బడ్జెట్‌లో మహిళల కోసం దీపం పథకానికి రూ.2600 కోట్లు, తల్లికి వందనం కోసం రూ.9400 కోట్లు, ఎన్టీఆర్ భరోసా పింఛన్ల కోసం రూ.27,516 కోట్లు కేటాయించడం ప్రశంసనీయ విషయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధితో పాటు పలు సంక్షేమ పథకాలకు కేటాయింపులు చేయడం, ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడమేనన్నారు.

వెనుకబడిన వర్గాలకు ప్రాధాన్యం

కటకం ధనలక్ష్మీశ్వరరావు, మలికిపురం కోనసీమ దేవాంగసంక్షేమ ఉపాధ్యక్షుడు



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ వెనుకబడిన వర్గాలకు ఇచ్చిన ప్రాధాన్యత గతంలో ఎప్పుడూ లేదన్నారు. ఆధరణ పథకానికి రూ.వెయ్యి కోట్లు, మత్స్యకార భరోసాకు రూ.450 కోట్లు వంటి అంశాలతో పాటు బీసీ కార్పొరేషన్‌కు నిధులు మంజూరు చేయడం శుభ పరిణామమన్నారు. బడ్జెట్ ప్రజా బడ్జెట్ అని వ్యాఖ్యానించారు.

ఆదాయానికి గండి పడుతున్నా పట్టించుకోరా..

● రూ.11లక్షల బ్యాంకు బకాయిలు వసూలు చేయలేరా ● కౌన్సిల్ సమావేశంలో అధికార విపక్ష కౌన్సిలర్లు ధ్వజం



అధికారులను నిలదీస్తున్న అధికార, విపక్ష కౌన్సిలర్లు

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఆదాయానికి గండి కొడుతున్నా పట్టించుకోరా అని అధికార విపక్ష కౌన్సిలర్లు అధికారుల తీరును దుయ్యబట్టారు. పురపాలక సంఘానికి సంబంధించిన షాపులను లీజులకు తీసుకుని సబ్‌లీజులకు ఇస్తూ లక్షలాది రూపాయల బకాయిలతో మూసేస్తుంటే ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. సర్క్యులర్ బజార్ ప్రాంగణంలోని ఐసీఐసీఐ బ్యాంకు అద్దె బకాయిలు రూ.11లక్షలు వసూలు చేయలేరా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమలాపురం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి అధ్యక్షతన శుక్రవారం వాడివేడిగా సాగింది. టీడీపీ కౌన్సిలర్ బొర్రా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పురపాలక సంఘానికి సంబంధించి ఆదాయాన్ని ఇచ్చే షాపులు ఎన్ని ఉన్నాయి. ఎన్ని రెగ్యులైజేషన్ చేశారని తొలుత ప్రశ్నించారు. ఇప్పటి వరకు ఎన్ని షాపుల నుంచి డిపాజిట్లు, సాల్వెన్సీలు తీసుకున్నారో చెప్పాలని పట్టుబట్టారు. పురపాలక సంఘానికి అల్లాడ దుర్గ రూ.1.27లక్షలు అద్దె బకాయి ఉండగా కాంట్రాక్టుకు పాటదారునిగా ఎలా పరిగణలోనికి తీసుకున్నారని పలువురు సభ్యులు ప్రశ్నించారు ఐసీఐసీఐ బ్యాంకు లక్షలాది రూపాయలు అద్దె బకాయిలు చెల్లించాల్సి ఉండగా ఇంత వరకు ఏం చర్యలు తీసుకున్నారని అధికార పక్ష కౌన్సిలర్లు మట్టపర్తి నాగేంద్ర, గొవ్వాల రాజేష్, దొమ్మేటి రాములు ప్రశ్నించారు. ఐసీఐసీఐ బ్యాంకుకు ఇప్పటికే ఫైనల్ నోటీసులు అందించామని, ఏప్రిల్‌లో షాపులు ఖాళీ చేస్తామని చెప్పినట్టు రెవెన్యూ ఆఫీసర్ శ్రీలక్ష్మి వివరించారు. వారి వద్ద నుంచి డిపాజిట్లు, సాల్వెన్సీలు తీసుకుని ఉంటే ఈపరిస్థితి వచ్చేది కాదు కదా అని సభ్యులు అబ్బిరెడ్డి చంటి, తిక్కా సత్యలక్ష్మిలు పేర్కొన్నారు. పూర్తి బకాయిలు వసూలుచేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు పేర్కొన్నారు.

బకాయిలు ఇప్పటికే రూ.80లక్షల వరకు పేరుకుపోయాయని బొర్రా వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. గతానికి, ఇప్పటికీ షాపుల రెన్యువల్ విధానంలో మార్పులు వచ్చాయని కమిషనర్ వివరించారు. ఆన్‌లైన్ విధానంలో పాత బకాయిలన్నీ పూర్తిగా చెల్లిస్తే గానీ షాపులు రెన్యువల్ అయ్యే పరిస్థితి లేదన్నారు. ఇంత వరకు సబ్‌లీజులకు ఎన్ని షాపులను ఇచ్చారో గుర్తించారా అని సభ్యులు ప్రశ్నించారు. షాపులు లీజుకు తీసుకున్నవారి నుంచి మూడు నెలల అద్దె అడ్వాన్సుగా తీసుకోవడంతో పాటు సాల్వెన్సీలు తప్పనిసరి చేయాలని, అవసరమైతే ఆర్ఆర్ యాక్టు అమలు చేయాలని అధికార, విపక్ష కౌన్సిలర్లు అధికారులకు సూచించారు. అధికారులు చిత్తశుద్ధితో పనిచేస్తేనే బకాయిలు వసూలు చేయగలమని కౌన్సిలర్లు యేడిద శ్రీను, పిండి అమరావతి, గండి దేవీ హారికలు పేర్కొన్నారు.

రోడ్ల మీద విచ్చలవిడిగా పశువులు, పెంపుడు జంతువులను విడిచిపెడితే మొదటిసారి అపరాధ రుసుం కింద రూ.500, రెండోసారి రూ.వెయ్యి, మూడోసారి రూ.1500 వసూలుచేసి పశువులను స్వాధీనం చేసుకుంటామన్నారు. అదే విధంగా బహిరంగ ప్రదేశాల్లో మల, మూత్ర విసర్జనచేసినా మొదటిసారి రూ.500, రెండోసారి రూ.వెయ్యి, మూడోసారి రూ.2వేలు అపరాధ రుసుం వసూలు చేయడంతో పాటు చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా బహిరంగ ప్రదేశాల్లోను, డ్రెయిన్లలోను చెత్తను పారబోసినా ఇదేవిధంగా చర్యలు ఉంటాయని, ఆ బాధ్యతలను వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ కార్యదర్శులకు అప్పగిస్తూ కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. సమావేశంలో వైస్‌చైర్మన్లు తిక్కరెడ్డి వెంకటేష్, రుద్రరాజు నానిరాజు, కౌన్సిలర్లు వాసంశెట్టి కృష్ణకుమారి, వాసర్ల శ్రీలక్ష్మి, పడాల శ్రీదేవితో పాటు అధికారులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో సైన్స్ దినోత్సవం

ముమ్మిడివరం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం సైన్స్‌దినోత్సవాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన సైన్స్ దినోత్సవంలో పాల్గొన్న వక్తలు మాట్లాడారు. 1928 ఫిబ్రవరి 28న ప్రతీ ఏటా భారతదేశంలో సైన్స్ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. వైస్ ప్రిన్సిపాల్ కె.చిట్టిబాబు, కళాశాల ఐక్యూ అసిస్టెంట్ కోఆర్డినేటర్ ఎన్.తులసీలక్ష్మి మాట్లాడారు. ఆంగ్ల అధ్యాపకులు డాక్టర్ జి.సుజాత, కంప్యూటర్ సైన్స్ అధ్యాపకుడు జీబీవీ పద్మనాభం పాల్గొని సైన్స్ దినోత్సవం, సీవీ రామన్ పరిశోధనల గురించి వివరించారు. కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులకు క్విజ్, పోస్టర్ ప్రజెంటేషన్ నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ప్రదర్శనలు

మామిడికుదురు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): సైన్స్‌డేను పురస్కరించుకుని మొగలికుదురు శ్రీచైతన్య స్కూలులో విద్యార్థులు రూపొందించిన సైన్స్ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం అమలాపురం కిమ్స్ ఆసుపత్రి సౌజన్యంతో మెడికల్ క్యాంపు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందించారు. మామిడికుదురు, అప్పనపల్లి హైస్కూలులో విద్యార్థులు సైన్స్ ప్రదర్శనలుఆకట్టుకున్నాయి.

ఘనంగా సైన్స్‌డే సంబరాలు

యానాం,ఫిబ్రవరి28(ఆంధ్రజ్యోతి): నియోజవర్గ పరిధిలోని వివిధ ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో సైన్సుడే వేడుకలు నిర్వహించారు. స్థానిక నల్లం రెసిడెన్షియల్ కాన్సెప్ట్ పాఠశాలలో విద్యాసంస్థల చైర్మన్ నల్లం నాగాబాబు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

ప్రణాళికాబద్ధంగా చదివితే పరీక్షల్లో ర్యాంకు వస్తుంది

మలికిపురం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పరీక్ష అనేది భయంకరమైన ప్రక్రియ కాదని, ఆహ్లాదకరమైన సవాలుతో కూడిన పని అని, సబ్జెక్టుపై అవగాహన కోసం చదివే చదువు వేరు. పరీక్ష కోసం చదవడం వేరు. ప్రణాళికాబద్ధంగా చదివితే మంచి ర్యాంకు వస్తుందని ప్రముఖ విద్యావేత్త, కోనసీమ సైన్స్ పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ సీవీ సర్వేశ్వరశర్మ అన్నారు. సైన్స్ దినోత్సవం సందర్భంగా లక్కవరం సరస్వతి శిశుమందిర్‌లో ఏర్పాటుచేసిన కోనసీమ సైన్స్ పరిషత్ 2905 సభలో సర్వేశ్వరశర్మ పబ్లిక్ పరీక్ష రాయబోతున్న పదో తరగతి విద్యార్థులకు చక్కని ప్రేరణ ఉపన్యాసం ఇచ్చారు. సభలో మంగెన వెంకటనరసింహారావు, మంగెన గౌరీనాథ్, డాక్టర్ కేవీ ఆనంద్, అరుణ, కృష్ణ, పీవీవీ ప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

రికార్డుల తనిఖీ నిరాకరణ

అంతర్వేది, ఫిబ్రవరి28(ఆంధ్రజ్యోతి): ఇటీవల రామేశ్వరం పంచాయతీలో సీసీఆర్ సంస్థ సభ్యులు రికార్డుల తనిఖీకి విచ్చేశారు. రామేశ్వరం పంచాయతీకి సంబంధించి సమాచారహక్కు చట్టం 2005 సెక్షన్ (జే1) అమలు, ప్రజలకు అవగాహన కోసం సంస్థ సభ్యులు పదకొండు మంది దరఖాస్తులు చేశారు. దీనిపై గ్రామ కార్యదర్శి దాసరి సత్యనారాయణ స్పందిస్తూ సమాచారహక్కు చట్టం ద్వారా పదకొండు మంది సభ్యులు రికార్డుల తనిఖీకి నిరాకరించామని తెలిపారు.రికార్డుల తనిఖీకి దరఖాస్తు చేసుకున్న ఒక్కరికి అనుమతిస్తామని కార్యదర్శి సత్యనారాయణ తెలిపారు. దీంతో సమాచారహక్కు చట్టం సభ్యులు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రికార్డుల తనిఖీ పంచాయతీల్లో అవకాశమివ్వాలన్నారు.

బంగారం ఉందంటూ..

బాలయోగిస్టేడియంలో యూట్యూబర్ హంగామా



హంగామా చేస్తున్న యూట్యూబర్

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): అమలాపురం బాలయోగి స్టేడియంలోకి శుక్రవారం మధ్యాహ్నం వందలాది మంది యువకులు మోటారు సైకిళ్లపై దూసుకువచ్చారు. వారికంటే ముందు ఒక యూ ట్యూబర్ కారులో దిగాడు. ముందుగానే వారందరికీ సమాచారం అందించడంతో పరిసర ప్రాంతాలకు చెందిన యువకులు తరలివచ్చారు. స్టేడియంలో ఒక ప్రాంతంలో బంగారు ఆభరణాన్ని ఉంచాను. దాన్ని ఎవరు ముందు తెస్తారో చూస్తానంటూ యూ ట్యూబర్ పేర్కొనడంతో యువకులంతా స్టేడియంలోని పలు ప్రాంతాల్లో ఎక్కడికక్కడ పెద్దపెద్ద రంధ్రాలు చేశారు. అప్పటికే సమాచారం అందుకున్న జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకుడు పీఎస్ సురేష్‌కుమార్ సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. అప్పటికే ఓ యువకుడు బంగారు ఆభరణం తనకు దొరికిందంటూ ముందుకు రావడంతో వారంతా సంబరాల్లో మునిగిపోయారు. సురేష్‌కుమార్ యూట్యూబర్ వద్దకు చేరుకుని అసలు క్రీడా ప్రాంగణంలోకి అనుమతి లేకుండా ఎలా వచ్చారంటూ ప్రశ్నించారు. తక్షణం కారులు, వాహనాలు తీసుకుని బయటికి వెళ్లిపోవాలని హెచ్చరించారు. యూ ట్యూబర్ యువకులతో కలిసి అక్కడి నుంచి బయటికి వెళ్లిపోయాడు.

ఈవీఎంల భద్రతకు పటిష్ట చర్యలు: డీఆర్వో



ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల గోదామును పరిశీలిస్తున్న డీఆర్వో రాజకుమారి

ముమ్మిడివరం, ఫిబ్రవరి28(ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల భద్రతకు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారిణి బీఎల్ఎన్ రాజకుమారి సూచించారు. ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాలలో గత ఎన్నికల్లో వినియోగించిన ఈవీఎంలు భద్రపరిచిన గోదామును శుక్రవారం ఆమె అధికారులతో కలిసి పరిశీలించారు. నెలవారీ తనిఖీల్లో భాగంగా గోదాము సీలును తనిఖీచేసి రిజిస్టర్‌లో సంతకం చేశారు. ఈవీఎంల భద్రతకు ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. ప్రతీ మూడు నెలలకు ఒకసారి గుర్తింపు పొందిన రాజకీయ నాయకుల సమక్షంలో ఈవీఎం గోదామును తనిఖీచేసి నివేదికను ఎన్నికల సంఘానికి పంపిస్తామని ఆమె తెలిపారు. ఎలక్షన్ డిప్యూటీ తహశీల్దార్ శివరాజ్, ముమ్మిడివరం డీటీ గోపాలకృష్ణ, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక షాపులు కేటాయించాలి

కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలకు జిల్లాలోని రైతు బజార్లలో ప్రత్యేకంగా షాపులను కేటాయించి వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకాలను ప్రోత్సహించే దిశగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం వ్యవసాయ, రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై కన్వర్జెన్సీ సమావేశం నిర్వహించారు. ఖరీఫ్ సీజన్ యాక్షన్ ప్లాన్‌ను వ్యవసాయ, ఉద్యాన, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రూపొందించాలన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటల ప్రదర్శనను, స్టాల్స్‌ను తొలుత కలెక్టర్ పరిశీలించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు, డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్, రైతు సాధికార సంస్థ ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పనిచేసిన వారికి గుర్తింపు

అంబాజీపేట, ఫిబ్రవరి28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు అంకిత భావంతో పనిచేస్తే వారికి ఎల్లప్పుడు గుర్తింపు ఉంటుందని కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్ అన్నారు. స్థానిక వాసవీ కల్యాణ మండపంలో తహశీల్దారుగా పనిచేసిన ఉద్యోగ విరమణ చేసిన జె.వెంకటేశ్వరి సన్మాన సభ రెవెన్యూ ఉద్యోగుల సంఘ నాయకులు దివాకర్ అధ్యక్షతన నిర్వహించారు. వెంకటేశ్వరి దంపతులను ప్రజాప్రతినిధులు, రెవెన్యూ, పంచాయతీరాజ్ ఉద్యోగులు, రేషన్ డీలర్లు, వీఆర్వోలు, వీఆర్ఏలు, సర్వేయర్లు, స్థానికులు సత్కరించారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి సుబ్బారావు, డిప్యూటీ తహశీల్దారు వెంకటేశ్వరరావు, ఆర్ఐ ఏడుకొండలు, వీఆర్వోలు, సర్వేయర్లు, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

ఇంటర్‌పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

అంబాజీపేట, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): పుల్లేటికుర్రు ఏపీఎస్ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చీఫ్ సూపరింటెండెంట్ కె.రమాదేవి తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం 249, రెండో సంవత్సవరం 241మంది పరీక్షలు రాస్తున్నట్లు తెలిపారు.

కాశీకి ఘన నివాళి



అమలాపురం రూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత వ్యాయామోపాధ్యాయుడు రంకిరెడ్డి కాశీవిశ్వనాథం మృతి క్రీడా రంగానికి తీరని లోటని సపక్‌తక్రా అసోసియేషన్ జిల్లాశాఖ అధ్యక్షుడు జవ్వాది తాతబాబు పేర్కొన్నారు. అమలాపురం ఎస్కేబీఆర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో శుక్రవారం సపక్‌తక్రా అసోసియేషన్ ఆధ్వర్యంలో కాశీ మృతికి సంతాపం సభను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సూర్యనారాయణరాజు, నరసింహారావు, కూచిమంచి కృష్ణ, తోట రాము, రామరాజు, విశ్వనాథశర్మ, కేవీ సత్యనారాయణ, కొమ్ములసురేష్, రమేష్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

పదవిలో అందించిన సేవలే వారికి గుర్తింపు: డీఎంహెచ్‌వో

ముమ్మిడివరం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు వారి పదవీ కాలంలో అందించిన సేవలే వారికి సమాజంలో గుర్తింపునిస్తాయని డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర పేర్కొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో డిప్యూటీ పారామెడికల్ అధికారిగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన పోతుల వెంకటేశ్వరరావును శుక్రవారం ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. రాష్ట్ర పారామెడికల్ అసోసియేషన్ కార్యదర్శి మాధవరపు వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సన్మానసభలో డీఎంహెచ్‌వో దుర్గారావుదొర ముఖ్య అతిథిగా మాట్లాడారు. కార్యక్రమంలో కుష్టువ్యాధి నివారణాధికారిణి డాక్టర్ సీహెచ్ భరతలక్ష్మి, జిల్లాస ంచారశిక్షా నోడల్ అధికారి డాక్టర్ సుమలత, రామచంద్రపురం విశ్రాంత డీపీఎంలు గొల్లపల్లి కృష్ణ, బి.కృష్ణారావు, రామచంద్రపురం ఏపీఎన్‌జీజీవో అధ్యక్షుడు చిక్కాల సూర్యారావు, కార్యదర్శి కె.శ్రీనివాస్, రాష్ట్ర పారామెడికల్ అసోసియేషన్ పూర్వపు జనరల్ సెక్రటరీ ఎం.సాంబశివరావు పాల్గొన్నారు.

అగ్నిమాపక అధికారి బైరిశెట్టి మృతి

రాజోలు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): రాజోలులో నివాసం ఉంటున్న ముమ్మిడివరం అగ్నిమాపక అధికారి బైరిశెట్టి బాలకృష్ణ(62) ఆకస్మికంగా మృతిచెందారని ఎస్ఐ బి.రాజేష్‌కుమార్ తెలిపారు. ప్రతీరోజు రాజోలు నుంచి ముమ్మిడివరం అగ్నిమాపక కార్యాలయానికి మోటారుసైకిల్‌పై బాలకృష్ణ వెళుతుండేవారు. యథావిధిగా మోటారు సైకిల్‌పై రాజోలు నుంచి ముమ్మిడివరానికి వెళుతుండగా రాజోలు పంచాయతీ సమీపంలో బాలకృష్ణ ఒక్కసారిగా మోటారుసైకిల్ పైనుంచి క్రిందికి ఒక పక్కకు ఒరిగిపోయి రోడ్డుపై పడిపోయారు. దీంతో స్థానికులు గమనించి వెంటనే బాలకృష్ణను రాజోలు ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించారు. ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు బాలకృష్ణను పరీక్షించి అప్పటికే మృతిచెందినట్టు తెలిపారు. రాజోలు అగ్నిమాపక కేంద్రంలో ఫైర్‌మెన్‌గా పనిచేసి మూడు నెలల క్రితం పదోన్నతిపై ముమ్మిడివరం అగ్నిమాపక కేంద్ర అధికారిగా బాధ్యతలు చేపట్టారు. ఆయనకు భార్య ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రాజేష్‌కుమార్ తెలిపారు.

దేవదాయశాఖ ఆధ్వర్యంలో అమ్మవారి ఉత్సవాలు



అంతర్వేది, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలం కేశవదాసుపాలెం మెండుపాలెం వేంచేసి ఉన్న శ్రీపెద్దింట్లమ్మవారి జాతర మహోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి దేవస్థానం ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీసు అధికారుల సమక్షంలో తొలిసారి దేవదాయశాఖ నిర్వహించబోయే పెద్దింటమ్మవారి ఉత్సవాలకు సంబంధించి టెండర్లు, హుండీ లెక్కింపు అమ్మవారి నిలబెట్టే కార్యక్రమాలు జరిగాయని జిల్లా ఏసీ వి.సత్యనారాయణ తెలిపారు.

ఉత్సవాలు ప్రారంభం: శ్రీపెద్దింటమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా తొలిరోజు అమ్మవారికి శాస్త్రోక్తంగా జిల్లా ఏసీ సత్యనారాయణ, సీఐ నరేష్, ఎస్ఐ కె.దుర్గాశ్రీనివాస్, తనిఖీ అధికారి రామలింగేశ్వరరావులు చీర, సారె సమర్పించారు. తొలుత బాణసంచా కాల్పుల నడుమ డోలు, సన్నాయి మేళాలతో అమ్మవారిని నిలబెట్టి ధూప, దీప నైవేద్యాలు సమర్పించి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. స్థానికంగా భక్తులు అమ్మవారికి గరగలు సమర్పించారు. గతంలో అమ్మవారి ఉత్సవాల నిర్వాహకులు మెండు శ్రీను, సభ్యులు, జిల్లాఏసీ వి.సత్యనారాయణకు పోలీసుల సమక్షంలో అమ్మవారి ఆలయం, షాపులు, హుండీల తాళాలు అప్పగించినట్టు తెలిపారు. అనంతరం జిల్లా ఏసీ సత్యనారాయణ మాట్లాడుతూ నెల రోజుల పాటు జరిగే పెద్దింట్లమ్మవారి ఉత్సవాల్లో భక్తులకు అసౌకర్యం కలగకుండా చూస్తామని, వసతిఏర్పాట్లు తాగునీరు, ఆలయ పరిసరాల పరిశుభ్రత, వైభవంగా ఉత్సవాల నిర్వహణ కార్యక్రమాలు చేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో దేవదాయశాఖ సిబ్బంది, స్థానిక భక్తులు, పోలీసులు, విశ్రాంత ఈవో బి.వెంకటేశ్వరరావు, ఎస్ఐలు కె.దుర్గాశ్రీనివాస్, పి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాల ఉత్పత్తులను కొనుగోలు చేయాలి

ముమ్మిడివరం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘాల సభ్యులు ఇంటి వద్ద కుటీర పరిశ్రమల ద్వారా తయారుచేసిన ఉత్పత్తులను కొనుగోలుచేసి వారిని ప్రోత్సహించాలని ముమ్మిడివరం నగర పంచాయతీ కమిషనర్ పి.రవివర్మ సూచించారు. మెప్మా సిటీ మిషన్ మేనేజర్ సోమాని భాస్కర్ ఆధ్వర్యంలో ముమ్మిడివరం నగర పంచాయతీ కార్యాలయం పక్కన ఏర్పాటుచేసిన మెప్మా బజార్‌ను శుక్రవారం కమిషనర్ రవివర్మ ప్రారంభించి పర్యవేక్షించారు. పట్టణానికి చెందిన కొనుగోలుదారులు మెప్మా బజార్‌ను సందర్శించి డ్వాకా మహిళల ఉత్పత్తులను కొనుగోలు చేయాలన్నారు. మెప్మా బజార్‌లో లభ్యమయ్యే ఉత్పత్తులను కొనుగోలుచేసి మహిళా జీవనోపాధికి సహకరించాలని సీఎంఎం భాస్కర్, టీవో రాజేశ్వరి కోరారు. కార్యక్రమంలో వార్డుల రిసోర్స్ పర్సన్లు, డ్వాక్రా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

అమరజ్యోతి అంబేడ్కర్ గ్రంథానికి అరుదైన గుర్తింపు

యానాం, ఫిబ్రవరి28(ఆంధ్రజ్యోతి): జనమిత్ర పత్రిక వ్యవస్థాపక సంపాదకుడు కళైమామణి పొనుగుమట్ల విష్ణుమూర్తి రాసిన అమరజ్యోతి డాక్టర్ అంబేడ్కర్ పరిశోధనాత్మక గ్రంథాన్ని భారత ప్రభుత్వం కళలు మంత్రిత్వశాఖ నిర్వహిస్తున్న జాతీయ లైబ్రరీ అథారిటీ వారు రెఫరెన్సు గ్రంథంగా స్వీకరించి, తెలుగు విభాగంలో భద్రపర్చడానికి నిర్ణయించినట్లు ప్రధాన లైబ్రేరియన్ డి.కాళి విష్ణుమూర్తి నుంచి సమాచారం అందిందన్నారు. ఇదేకాకుండా దేశంలోని చెన్నై, ముంబాయి, ఢిల్లీ జాతీయ లైబ్రరీల్లో కూడా ఈగ్రంథాన్ని భద్రపర్చాలని నిర్ణయించారు. అంబేడ్కర్ పరిశోధనాత్మక గ్రంథంలో 352 పేజీలు 8అధ్యాయాలు ఉన్నాయన్నారు. భారతీయ దళిత సాహిత్య అకాడమి జాతీయ అధ్యక్షులు డా. సుమానక్షర్, కళైమామణి దాట్ల దేవదానం రాజు, బౌద్ధ పరిశోధకుడు పిల్లి రాంబాబులు పరిచయ వ్యాఖ్యలు రాశారు.

పార్టీని పటిష్టం చేయాలి

మామిడికుదురు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): పార్టీ శ్రేణులు కష్టపడి పనిచేసి వైసీపీని పటిష్ట పరచాలని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు పిలుపునిచ్చారు. మామిడికుదురులోని కటకంశెట్టి ఆదిత్య ఇంటి వద్ద జరిగిన వైసీపీ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ప్రతీ ఒక్కరూ పదవుల కోసం కాకుండా పార్టీ కోసం కష్టపడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కుసుమ వనజాకుమారి, నాయకులు భూపతిరాజు సత్తిబాబురాజు, గుబ్బల మనోహర్, బొలిశెట్టి భగవాన్, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా పట్టాభిరామస్వామి ఆలయ వార్షికోత్సవం

అంబాజీపేట, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): మాచవరం శివారు నందెపువారిపాలెంలో ఉన్న శ్రీపట్టాభిరామస్వామి ఆలయ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు.

కనకమహాలక్ష్మమ్మ, మహాలక్ష్మమ్మ అమ్మవార్ల జాతర

మలికిపురం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): మోరి కనకమహాలక్ష్మమ్మ, మహాలక్ష్మమ్మ అమ్మవార్ల జాతర, తీర్థ మహోత్సవాల సందర్భంగా శుక్రవారం రాత్రి అమ్మవారిని నిలబెట్టారు. ఈసందర్భంగా తీన్మార్ డప్పులతో వివిధ సంగీత వాయిద్యాలతో మునుపెన్నడూ లేవిధంగా కనులు మిరుమిట్లుగొలిపే భారీ బాణసంచాను కాల్చారు. అమ్మవారిని నిలబెట్టే సమయంలో వేలాదిగా మోరి, మోరిపోడు, ఉయ్యూరువారిమెరక, శృంగవరప్పాడు గ్రామాల నుంచి భక్తులు వచ్చారు. ఈనెల9 నుంచి 15వరకు అమ్మవారి తీర్థ మహోత్సవాలు భారీగా జరగనున్నాయి.

రామేశ్వరునికి పుష్పోత్సవం, చక్రస్నానం

అల్లవరం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): శ్రీరాముని శివలింగ ప్రతిష్ఠతో పురాణ ప్రసిద్ధి పొందిన ఎస్.రామేశ్వరంలోని పార్వతీ రామేశ్వరస్వామికి పుష్పోత్సవ పూజలు, చక్రస్నానం ఘనంగా జరిగాయి. వేదపురోహితులు పుల్లేటికుర్తి గౌరీశంకరం బ్రహ్మత్వాన ఫణి, చిన్నిఉమాశంకర్‌ల పర్యవేక్షణలో స్వామివారికి బలిహరణ పూజలు జరిగాయి. ఆలయ కమిటీ చైర్మన్ అంగాని రామారావు, గ్రామస్తులు పూజల్లో పాల్గొన్నారు. శనివార పార్వతీ రామేశ్వరాలయంలో హుండీ కానుకలు లెక్కిస్తామని చైర్మన్ తెలిపారు.

ఆర్థిక సాయం

అల్లవరం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): గోడి కొత్తకాలనీలో ఇటీవల విద్యుత్ ప్రమాదంలో చేయి కోల్పోయిన చిన్నారి కేతా లాస్య మాధురి, తీవ్రంగా గాయపడ్డ తల్లి రమాదేవిల కుటుంబానికి శెట్టిబలిజ హెల్పింగ్ హ్యాండ్స్ రూ.5.37లక్షల పోస్టాఫీసు బాండ్లను అందజేశారు. వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాస్, ఎంపీపీ యిళ్ల శేషగిరిరావు, బొక్కా శ్రీనివాసరావు, దొమ్మేటి రాము, గొవ్వాల రాజేష్, విత్తనాల శేఖర్, కడలి ప్రసాద్‌లు బాధిత కుటుంబానికి సాయం పాల్గొన్నారు.

మాణిక్యాంబ అమ్మవారి జాతర మహోత్సవాలు ప్రారంభం

ఐ.పోలవరం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఐలెండ్‌వాసుల ఇలవేల్పు, కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా అందరూ భావించే మురమళ్ల శ్రీ మాణిక్యాంబా అమ్మవారి జాతర మహోత్సవాలు మహాశివరాత్రి రోజున ప్రారంభమయ్యాయి. ఉగాది వరకు నెల రోజులు జాతర ఉత్సవాలు జరుగుతాయి. అమ్మవారి ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. అమ్మవారిని వివిధ రకాలు ఫలాలతో అలంకరించారు. దాతల సహకారంతో ఆలయం వద్ద నెల రోజులు భారీ స్థాయిలో అన్నసమారాధన నిర్వహిస్తారు. ప్రతి రోజు రాత్రి అమ్మవారి సంబరాలు వైభవంగా జరుగుతాయి.

చోరీ కేసును ఛేదించిన పోలీసులు

-ఇద్దరు నిందితుల అరెస్, రూ.1.01లక్షలు స్వాధీనం

పి.గన్నవరం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): చోరీ కేసును ఆరు రోజుల్లో పోలీసులు ఛేదించారు. ఈనెల23న పి.గన్నవరం ప్రధాన రహదారిలో ఉన్న గణేష్ మెడికల్‌షాపులో ఇద్దరు వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్ఐ బి.శివకృష్ణ కేసు దర్యాప్తు ప్రారంభించారు. శుక్రవారం తెల్లవారుజామున ఎస్ఐతో పాటు క్రైమ్ పార్టీ సిబ్బంది అక్విడెక్టు వద్ద అనుమానాస్పదంగా ఉన్న కాకినాడ జగన్నాధపురానికి చెందిన యండమూరి అభిషేక్‌కుమార్(24), బాలుడిని అదుపులోకి తీసుకున్నారు. నేరం చేసిన సమయంలో బైక్‌ను గుర్తించి సీఐ భీమరాజు ఆధ్వర్యంలో విచారించారు. పి.గన్నవరంలో జరిగిన చోరీకి సంబంధించి రూ.95వేలు నగదు, గత ఏడాది నవంబరులో రాజోలు మండలం తాటిపాకలో జరిగిన చోరీకి సంబంధించి మూడు బంగారు ఉంగరాలు, అమలాపురంలో జరిగిన నేరాలకు సంబంధించి రూ.6వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. దర్యాప్తులో భాగస్వామ్యులైన సీఐ భీమరాజు, ఎస్ఐ బి.శివకృష్ణ, క్రైమ్ సిబ్బందిని ఎస్పీ బి.కృష్ణారావు, అడిషనల్ ఎస్పీ ప్రసాద్‌లు అభినందించారు.

ఘనంగా టైలర్స్‌డే వేడుకలు

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ది అమలాపురం టౌన్ టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం టైలర్స్‌డే వేడుకలను నిర్వహించారు. లవకుశ ఫేమ్ వియ్యూరి నాగసుబ్రహ్మణ్యం ముఖ్య అతిథిగా హాజరై తొలుత టైలర్స్ పతాకాన్ని ఆవిష్కరించారు. స్థానిక ముస్లింవీధిలో జరిగిన కార్యక్రమంలో చాంబర్‌ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ పాల్గొని విలియంహో చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన కొప్పిశెట్టి సుబ్రహ్మణ్యం కుటుంబానికి రూ.20వేలు ఆర్థికసాయాన్ని కామనగరువు సర్పంచ్ నక్కా అరుణకుమారి చేతులమీదుగా అందజేశారు. ఎన్.నాగేశ్వరరావు, కొమానపల్లి శ్రీనివాసరావు, కొప్పిశెట్టి మోహనరావు, వెన్నా వెంకటరమణ, విత్తనాల బుల్లియ్య, ఎన్.గంగాధరరావు, బి.శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

130 కేసుల్లో స్వాధీనం చేసుకున్న మద్యం ధ్వంసం

అమలాపురంటౌన్, ఫిబ్రవరి28(ఆంధ్రజ్యోతి): అమలాపురం, ఉప్పలగుప్తం, అల్లవరం, అమలాపురం రూరల్ పోలీసుస్టేషన్ల పరిధిలో 13కేసుల్లో స్వాధీనం చేసుకున్న 3220మద్యం బాటిళ్లు, 859లీటర్ల ఎన్డీపీమద్యంతో 56లీటర్ల నాటుసారాను శుక్రవారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఏఈఎస్ అమర్‌బాబు పర్యవేక్షణలో మద్యాన్ని ధ్వంసంచేశారు. మొత్తం మద్యం, నాటుసారాను అమలాపురం 30వవార్డులోని రజకపేటలో ఎక్సైజ్ సీఐ వీటీవీవీ సత్యనారాయణ, పట్టణ సీఐ పి.వీరబాబు, ఎస్ఐలు వై.శేఖర్‌బాబు, జి.హరీష్‌కుమార్, సీహెచ్ రాజేష్‌ల సమక్షంలో నిబంధనల మేరకు ధ్వంసం చేశారు.

మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

వాడపల్లి ఒకరోజు ఆదాయం రూ.1.88లక్షలు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీనెలకొంది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. స్వామి వారిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్న ప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒకరోజు ఆదాయం రూ.1,88,940 వచ్చినట్టు ఉప కమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

పరిశ్రమల జిల్లా అధికారి శివరామప్రసాద్



అవగాహన సదస్సుల్లో మాట్లాడుతున్న దృశ్యం

ఆత్రేయపురం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘాల మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని పరిశ్రమల జిల్లా అధికారి శివరామప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం ఆత్రేయపురం మండల వెలుగు కార్యాలయంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధికి సంబంధించి వివిధ సంఘాల సభ్యులకు అవగాహన సదస్సును నిర్వహించారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అనంతరం వివిధ అంశాలపై అవగాహన చేశారు. కార్యక్రమంలో ముదునూరి వెంకట్రాజు, గాదిరాజు ప్రసాదరాజు, ఎంపీడీవో వెంకటరామన్, ఫుడ్ ప్రాసెసింగ్ డీఆర్పీ ఈశ్వరరావు, వెలుగు ఏపీఎం గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కొత్త మోటారు వాహన సవరణ చట్టం అమలు



వివరాలు తెలుపుతున్న డీఎస్పీ రఘువీర్

ద్రాక్షారామ, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన మోటార్ వాహనాల సవరణ చట్టం నేటి నుంచి అమలులోకి వస్తోందని రామచంద్రపురం డీఎస్పీ బి.రఘువీర్ తెలిపారు. దీని ప్రకారం నియమ, నిబంధనలు పాటించని వారికి జరిమానా, జైలుశిక్ష విధింస్తామని తెలిపారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇప్పటికే రహదారి భద్రతా వారోత్సవాల్లో ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహించినట్టు తెలిపారు. నేటి నుంచి డ్రైవింగ్ లైసెన్సు లేకుండా నడిపితే రూ.5 వేల వరకు జరిమానా విధిస్తామన్నారు. హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే రూ 1000 జరిమానా విధిస్తామన్నారు. వాహనదారులు, ప్రజలు కొత్త మోటారు వాహన చట్టాల నియమ నిబంధనల ప్రకారం వాహనాలు నడుపుతూ అన్ని జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సమావేశంలో సీఐ ఎం.వెంకట నారాయణ, ఎస్ఐ ఎస్.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

స్పీకర్‌కు బడ్జెట్ ప్రతుల అందజేత

ముండపేట, ఫిబ్రవరి, 28(ఆంధ్రజ్యోతి) శాసనసభలో బడ్జెట్ ప్రవేశపెట్టే ముందు ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌తో కలిసి స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడుకి బడ్జెట్ ప్రతిని అందిస్తున్న మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, ఉపసభాపతి కనుమూరి రఘురామ కృష్ణంరాజు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఆదియోగి విగ్రహానికి పోటెత్తుతున్న భక్తులు

మండపేట, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ద్వారపూడి అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో ఇటీవల ఏర్పాటు చేసిన ఆదియోగి విగ్రహాన్ని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తుతున్నారు. మహాశివరాత్రి నాడు ప్రారంభమైనప్పటి నుంచి ప్రతిరోజూ రాష్ట్రం నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఇదే తొలి విగ్రహం కావటంతో దీన్ని చూసేందుకు పగలు, రాత్రి తేడా లేకుండా వస్తున్న భక్తులకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.



ద్వారపూడిలో ఏర్పాటు చేసిన ఆదియోగి విగ్రహం

మానవళి అభివృద్ధికి సైన్స్ దోహదం



కపిలేశ్వరపురం: మాచరలో సైన్స్ ప్రయోగాలను తిలకిస్తున్న డీఈవో సలీంభాషా

కపిలేశ్వరపురం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): శాస్త్ర, సాంకేతిక విషయాల పట్ల విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి (డీఈవో) డా. షేక్ సలీం భాషా అన్నారు. శుక్రవారం మాచర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జాతీయ సైన్స్ దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మాచర పూర్వ విద్యార్థుల సంక్షేమ సంఘం ప్రొఫెసర్ గొడవర్తి భగవన్నారాయణ ఆధ్వర్యంలో పాఠశాల హెచ్ఎం రమాదేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డీఈవో సలీంభాషా, ప్రొఫెసర్ భగవన్నారాయణ ప్రసంగించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన వివిధ రకాల సైన్స్ ప్రాజెక్టులను డీఈవో షలీంభాషా పరిశీలించి అభినందించారు. విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందించారు. పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు రాజశేఖరాన్ని సత్కరించారు. తొలుత సీవీ రామన్, అబ్దుల్‌కలాం చిత్రపటాలకు మాచర అలూమిని సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రత్నకుమారి, జిల్లా సైన్స్ అధికారి జీవీవీఎస్ సుబ్రహ్మణ్యం తదితరులతో పాటు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కె.గంగవరం(ఆంధ్రజ్యోతి): మండలంలోని దంగేరు, కె.గంగవరం, పామర్రు తదితర ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. కె.గంగవరం ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. క్విజ్, ముగ్గులు, సైన్స్ ఎగ్జిబిషన్‌లు నిర్వహించారు. భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు పి.బ్రహ్మానందం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పి.వెంకటేశ్వరరావు, శ్రీధర్, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రావులపాలెం(ఆంధ్రజ్యోతి): రావులపాలెం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలో జాతీయ సైన్సు దినోత్సవాన్ని నిర్వహించారు. సిద్ధార్థ పాఠశాలలో డైరెక్టర్ కె.ముల్లారావు ఆధ్వర్యంలో విద్యార్థులు ఏర్పాటు చేసిన పలు ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సైన్సు డే వేడుకలు జరిపారు.

రాయవరం(ఆంధ్రజ్యోతి): మానవళి అభివృద్ధికి సైన్స్ ఎంతగానో దోహదపడిందని రాయవరం భాష్యం స్కూల్ ప్రిన్సిపాల్ పట్నాల శ్రీనివాస గుప్తా అన్నారు. శుక్రవారం భాష్యం స్కూల్‌లో సైన్స్‌డే నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నేటి యువత సీవీ రామన్ సేవలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. తొలుతగా ప్రిన్సిపాల్ సీవీ రామన్ చిత్రపటానికి నివాళులర్పించారు. స్కూల్‌లో 1 నుంచి 10వ తరగతి విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ప్రయోగాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రైమరీ ప్రిన్సిపాల్ ఎం.కాంచన, పాఠశాల ఉపాధ్యాయుడు ద్వారంపూడి చిన్నబాబు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సైన్స్ ఆధారంగానే జీవనం

ఆలమూరు(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సైన్స్‌పై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలని శ్రీసిద్దార్థ హైస్కూల్ డైరెక్టర్ కె.ముల్లారావు అన్నారు. ఆలమూరు శ్రీసిద్దార్థ హైస్కూల్‌లో సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సైన్స్ విజ్ఞాన ప్రదర్శనలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉత్తమ పరికరాలను ఎంపిక చేశారు. చెముడులంక సత్య విద్యానికేతన్‌లో విద్యానికేతన్ ముఖ్య సలహాదారుడు పి.కుమార్ అధ్వర్యంలో సైన్స్ దినోత్సవం జరిపారు. విద్యార్థులు చేసిన పరికరాలను ప్రదర్శించారు.

ఘనంగా చండీయాగం

ఆలమూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): చింతలూరు నూకాంబిక ఆలయం వద్ద శుక్రవారం చండీయాగం చేశారు. అమ్మవారి ఆలయం వద్ద కార్యనిర్వహణాధికారి వుండవల్లి వీర్రాజుచౌదరి అధ్వర్యంలో ఏర్పాటు చేసిన చండీయాగాన్ని పండితులు శాస్త్రోక్తంగా జరిపించారు. యాగాన్ని తిలకించడానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

వాడపల్లి పుష్కరిణి పనులు వేగవంతం

• గత ప్రభుత్వ హయాంలో అటకెక్కిన వైనం • కూటమి ప్రభుత్వంలో పనులకు మోక్షం



వాడపల్లి ఆలయం వద్ద జరుగుతున్న పుష్కరిణి పనులు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో పుష్కరిణి పనులు వేగంగా జరుగుతున్నాయి. ప్రభుత్వం రూ.2.80కోట్ల నిధులను దీనికి కేటాయించడంతో వీటి పనులు వేగంగా జరుగుతున్నాయి. ఆలయ రాజగోపురం ఎదురుగా కొనేరును నిర్మిస్తున్నారు. తిరుమల తరహాలో కొనేరు నిర్మాణానికి మాస్టర్ ప్లాన్ రూపొందించారు. గత ప్రభుత్వ హయాంలో పంచాయతీ చెరువును పుష్కరిణిగా అభివృద్ధి చేయాలని సంకల్పించారు. 2002 పుష్కరిణి నిర్మాణానికి అప్పటి సీఎం రూ.2 కోట్లు మంజూరు చేయగా హడావిడిగా చెరువు పూడిక పనులు చేపట్టారు. ఈ నిధులు ఏ శాఖ ద్వారా అందించాలనేది స్పష్టత లేకపోవడంతో పుష్కరిణి పనులు అటకెక్కిందని భక్తులు అభిప్రాయపడ్డారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పుష్కరిణి నిర్మాణానికి నడుం బిగించారు. రెండు పర్యాయాలు అధికారుల బృందంతో పర్యటించి నిర్మాణానికి చర్యలు చేపట్టారు. ప్రభుత్వం రూ.2.80 కోట్లు నిధులు మంజూరు చేయడంతో పుష్కరిణి పనులు ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణలో యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నారు. వీటి పనులను ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఏప్రిల్‌లో జరిగే స్వామివారి కల్యాణోత్సవాలకు వీటిని పూర్తిచేసి స్వామివారి తెప్పోత్సవాన్ని కొనేరులో నిర్వహించేలా చర్యలు చేపడుతున్నారు.

అన్ని వర్గాలకు బడ్జెట్‌లో న్యాయం

తల్లికి వందనం పథకానికి నిధుల కేటాయింపు శుభపరిణామం

బీఎస్ సరోజిని, కరస్పాండెంట్, చైర్మన్ వివేకానంద గ్రూప్ ఆఫ్ స్కూల్స్



ద్రాక్షారామ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాలకు బడ్జెట్‌లో న్యాయం చేశారని వక్తలు అభిప్రాయ పడ్డారు. రాష్ట్ర బడ్జెట్‌లో తల్లికి వందనం పథకానికి నిధులు కేటాయించడం శుభపరిణామం. 2025-26 విద్యా సంవత్సరం నుంచి 1 నుంచి 12వ తరగతి వరకు చదివే పిల్లల తల్లులకు ఏడాదికి రూ.15 వేలు అందించేందుకు ప్రభుత్వం రూ.9407 కోట్లు నిధులు కేటాయించింది. దీంతో పేదలు పిల్లలకు పాఠశాలలకు పంపడానికి ఈ పథకం దోహదం చేస్తుంది.

ప్రజామోదయోగ్యమైన బడ్జెట్

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సత్యానందం



కొత్తపేట, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అందరి ఆమోదయోగ్యమైన బడ్జెట్ అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం అన్నారు. ముఖ్యంగా రైతులకు పెద్దపీట వేసి రైతుల పక్షపాతిగా ప్రభుత్వం పనిచేస్తున్నదన్నారు.

అన్ని రంగాలకు మేలు చేసే బడ్జెట్

కె.సత్యనారాయణరెడ్డి, అర్తమూరు ఉపసర్పంచ్



ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అన్ని రంగాలకు నిధులు కేటాయింపులు బాగా జరిగాయని అర్తమూరు గ్రామ ఉపసర్పంచ్ కర్రి సత్యనారాయణరెడ్డి అన్నారు. బడ్జెట్‌లో అన్ని రంగాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వటం హర్షణీయమన్నారు.

యువజన, పర్యాటకానికి పెద్దపీట

వెత్సా అనిల్, ఉచ్చిలి (ఆత్రేయపురం)



ఆత్రేయపురం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌లో యువజన, పర్యాటక రంగానికి రూ.469 కోట్లు కేటాయించింది. స్వచ్ఛంధ్ర పథకానికి నిధులు కేటాయించడం అభినందనీయం.

మహిళలకు అధిక ప్రాధాన్యం

కరుటూరి విశ్వేశ్వరి, అంకంపాలెం



మహిళా సంక్షేమానికి కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యం ఇచ్చింది. తల్లికి వందనం, దీపం పథకానికి, మహిళా శిశు సంక్షేమమానికి నిధులు కేటాయించడం శుభపరిణామం.

వ్యవసాయ రంగానికి పూర్వ వైభవం

తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ



రావులపాలెం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగానికి పూర్వ వైభవం తెచ్చే విధంగా బడ్జెట్‌లో నిధుల కేటాయింపు ఉంది. వ్యవసాయ రంగానికి రూ.48వేల కోట్లు కేటాయించి రైతులకు అండగా కూటమి ప్రభుత్వం నిలబడిందన్నారు.

సంక్షేమానికి బాసటగా బడ్జెట్

టీడీపీ నాయకులు



సంక్షేమానికి బాటలు వేసేలా బడ్జెట్ ఉందని జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి ముత్యాల బాబ్జి, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు కాసా సాగర్ అన్నారు. ఈ బడ్జెట్‌లో అన్ని రంగాలు అభివృద్ధి పథంలో నడిపించే విధంగా కేటాయింపు జరిగిందన్నారు.

రాష్ట్ర బడ్జెట్ భేష్

జనసేన మండపేట ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ



ప్రభుత్వ బడ్జెట్ అన్ని రంగాలకు పెద్దపీట వేసిందని మండపేట నియోజక వర్గ జనసేన ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ అన్నారు. ఇరిగేషన్, విద్య, వ్యవసాయం, యువత ఉపాధి అవకాశాలకు పెద్దపీట వేసిందన్నారు. ఇది ప్రజా బడ్జెట్ అని ఆయన అన్నారు.

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

రాయవరం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని 12 గ్రామాల్లో సామాజిక పింఛన్ల పంపిణీ శనివారం ఉదయం 7 గంటల నుంచి ప్రారంభించనున్నట్లు ఎంపీడీవో ఎస్.కీర్తి స్పందన శుక్రవారం తెలిపారు. వీటి పంపిణీకి నియమించిన సిబ్బంది పించన్‌దారుల ఇంటి వద్దకు వెళ్లి పంపిణీ చేపట్టనున్నట్లు చెప్పారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

రాయవరం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పబ్లిక్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రాయవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల చీఫ్ సూపరింటెండెంట్ డీవీవీ నాగేశ్వరరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఉదయం 8.30 గంటలకు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు. పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులకు తాగునీరు, మౌలిక సదుపాయాలు కల్పించినట్లు చెప్పారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మండపేట, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి) మండపేటలో 23న వల్లూరి వీధి మలుపులో గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో గాయపడిన వ్యక్తి శుక్రవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. పట్టణ పోలీసుల సమాచారం ప్రకారం రావులపేటకు చెందిన ఇంటి గోపిశేఖర్‌ను ఈనెల 23న గుర్తు తెలియని ఐషర్‌వ్యాన్ ఢీకొట్టిందన్నారు. దీనిపై సమీప బంధువు నంది కోళ్ల సురేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడన్నారు. అప్పటి ప్రమాదంలో గాయపడిన గోపిశేఖర్ కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడని పోలీసులు తెలిపారు.

నూకాంబిక ఆలయానికి విరాళం

ఆలమూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): చింతలూరు నూకాంబిక అమ్మవారి ఆలయం అభివృద్ధికి గుమ్మిలేరు గ్రామానికి చెందిన వంక అన్నవరం రూ.2లక్షల విరాళం అందించారు. ఇటీవల ఆలయం వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులకు ఉపకరించేలా పారిశ్రామికవేత్త వంక అన్నవరం ఆయన పార్టనర్స్ వైట్ల కనకదుర్గారావు, వంక రాజు, వెంకట్రావు సమక్షంలో రూ.2 లక్షల విరాళాన్ని నూకాంబిక ఆలయ ఈవో వుండవల్లి వీర్రాజుచౌదరికి అందించారు. కార్యక్రమంలో నాయకులు వైట్ల శేషుబాబు, గన్ని చిన్నబ్బు, గన్ని సూరిబాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాతను పలువురు అభినందించారు.



ఏడిద చేరుకున్న సంఘమేశ్వరస్వామి రథం

ఏడిదకు చేరుకున్న రథం

మండపేట, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి) మండపేట మండలం ఏడిద సంఘమేశ్వర స్వామివారి రథం మూడురోజుల తర్వాత శుక్రవారం ఏడిదకు చేరుకుంది. మహాశివరాత్రిని పురస్కరించుకుని ఆలయం నుంచి బయలుదేరి శుక్రవారం ఏడిద చేరుకుంది. ఏడిదలో రాత్రి అప్పడాల తీర్థం జరిగింది.

ఘనంగా సైన్స్ డే వేడుకలు

మండపేట, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): మండపేట అర్బన్, రూరల్‌లో శుక్రవారం సైన్స్ డేను నిర్వహించారు. ముందుగా సర్ సీవీ రామన్ చిత్రపటానికి నివాళులర్పించారు. మండపేటలో వున్న సెయింట్ ఆన్స్ పాఠశాల, భాష్యం పాఠశాల, ఆలమూరు మండపేట రోడ్డులో వున్న విజ్ఞాన్ కళాశాలతో పాటు, ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో సైన్స్ డేను జరిపారు. మండపేట మండలం తాపేశ్వరం శ్రీచైతన్య పాఠశాలలో విద్యార్థులు సైన్సు డే సందర్భంగా ప్రదర్శించిన ప్రదర్శనలో వస్తువులు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు స్థానిక నేతలు సైన్స్ ఆవశ్యకతను తెలిపారు.

విద్యార్థులు వైజ్ఞానికంగా ఎదగాలి



సైన్సు ఫెయిర్‌లో ప్రాజెక్టులను పరిశీలిస్తున్న డీఎస్పీ మురళీమోహనరావు

కొత్తపేట, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతో పాటు వైజ్ఞానికంగా ఎదిగాలని కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీ మోహనరావు పేర్కొన్నారు. శుక్రవారం సైన్సు దినోత్సవాన్ని పురస్కరించుకుని క్రాంతి భారతి, భాష్యం స్కూల్స్‌లో జరిగిన సైన్సు ప్రదర్శనలను ఆయన తిలకించారు. విద్యార్థులు చేసిన పలు ప్రాజెక్టులను అభినందించారు. కార్యక్రమంలో భాష్యం జోనల్ ప్రిన్సిపాల్ జె.శ్రీనివాస్, ప్రిన్సిపాల్ ఎం.లోకేశ్వరరావు, రిటైర్డ్ ఎంఈవో వై.సత్తిరాజు, తోట వెంకటేశ్వరరావు, బి.సత్యవాణి, ఎన్.రమాజ్యోతి తదితరులు పాల్గొన్నారు.



కె.గంగవరం మండలం అముజూరులో విలియన్ హో చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టైలర్లు



ఆలమూరులో టైలర్స్‌డే సందర్భంగా విలియమ్స్‌హో చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం

ఘనంగా టైలర్స్ డే

ద్రాక్షారామ, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం పట్టణంతో పాటు, మండలంలో శుక్రవారం టైలర్స్ డేని ఘనంగా జరిపారు. టైలర్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని టౌన్ హాలులో జరిగిన కార్యక్రమంలో టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కుట్టుమిషను సృష్టికర్త విలియమ్స్ హో చిత్రపటానికి నివాళుర్పించారు. అనంతర పట్టణంలో ర్యాలీ జరిపారు. రాజగోపాల్ సెంటర్‌లో విలియమ్స్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్యదర్శి సోమన్న, మాజీ అధ్యక్షులు యండమూరి చంద్రశేఖర్, సీనియర్ టైలర్ సాదురావు, యండమూరి శ్రీనివాస్, వెంప అర్జునరావు, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. కుట్టుమిషను రిపేరు చేసే ఎం.రామారావు, జానకి దంపతులను పలువురు సత్కరించారు.

ద్రాక్షారామలో:

ద్రాక్షారామలో టైలర్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని విలయమ్స్ హో చిత్రపటానికి నివాళులర్పించారు. భీమేశ్వర దంత వైద్యశాల వైద్యుడు క్రాంతికుమార్ టైలర్లకు ఉచిత దంత వైద్య శిబిరంలో 50 మందికి దంత పరీక్షలు నిర్వహించారు.

కె.గంగవరం(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీఛాయాసోమేశ్వర టైలర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం టైలర్ల దినోత్సవం నిర్వహించారు. అముజూరు గ్రామంలో సమావేశమైన టైలర్లు కుట్టుమిషన్ సృష్టికర్త విలియన్ హోమ్ చిత్రపటానికి నివాళులర్పించారు. సీనియర్ టైలర్ బాలబాలాజీని సత్కరించారు. టైలర్ పున్నం బుల్లియ్య జ్ఞాపకార్థం వారి కుమారులు రాము, పులేష్ టైలర్‌లకు భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మండలంలోని పలు గ్రామాల టైలర్‌లు కుడుపూడి చంద్రరావు, పిల్లి బీష్మాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాషన్ ప్రపంచానికి హౌవే దిక్సూచి



రాయవరం మండలం చెల్లూరులో విలియమ్స్ హౌవే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

రాయవరం(ఆంధ్రజ్యోతి): ఫ్యాషన్ ప్రపంచానికి విలియమ్స్ హౌవే ఆద్యుడని టైలర్స్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సీహెచ్‌వీవీఎన్ఆర్ గోపాలకృష్ణ అన్నారు. శుక్రవారం మండలంలోని చెల్లూరు గ్రామంలో వేణుగోపాల స్వామి ఆలయం సమీపంలో టైలర్స్ డే నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న గోపాలకృష్ణ, అసోసియోషన్ జిల్లా ఉపాధ్యక్షుడు సురుమళ్ల భాస్కరరావు మాట్లాడారు. తొలుత కుట్టుమిషన్ రూపకర్త విలియమ్స్ హౌవే చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో టైలర్స్ అసోసియేషన్ నాయకులు కె.వెంకటరమణ, బి.గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

రావులపాలెం(ఆంధ్రజ్యోతి): రావులపాలెం మండలంలో టైలర్స్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవీ క్లబ్ సభ్యులు టైలర్ మూర్తిని సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు పి.గోపాలకృష్ణమూర్తి, కె.నరసింహమూర్తి, చినబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆలమూరు(ఆంధ్రజ్యోతి): కుట్టుమిషన్ సృష్టికర్త విలయమ్స్ హో జయంతిని పురస్కరించుకుని ఆలమూరు మండలంలో శుక్రవారం టైలర్స్ డేను నిర్వహించారు. మండలంలోని కొత్తూరు సెంటర్‌లో టైలర్స్ జిల్లా అధ్యక్షుడు జక్కంశెట్టి స్వామి, నాయకులు కడలి వెంకటేశ్వరరావు, సూరంపూడి వెంకట్రావు తదితరులు అధ్వర్యంలో విలయమ్స్ హో చిత్రపటానికి నివాళులర్పించారు. ఆలమూరులో లంకే వెంకటరెడ్డి, చల్లా పేరుమాళ్లు తదితరుల అధ్వర్యంలో టైలర్స్ డే నిర్వహించారు.

కపిలేశ్వరపురం(ఆంధ్రజ్యోతి): అంగరలో ఆదిగణపతి టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం టైలర్స్ డేను నిర్వహించారు. ఈసందర్భంగా చిట్టంరెడ్డి సోమేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కుట్టుమిషన్ సృష్టికర్త విలియంహో చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం వెల్ఫేర్ అసోసియేషన్ కోనసీమ జిల్లా టైలర్స్ ప్రెసిడెంట్ గా జక్కంశెట్టి స్వామి ఎన్నికైన సందర్భంగా ఆయనను సంఘ సభ్యులు సత్కరించారు. సమావేశంలో చిట్టంరెడ్డి సోమేశ్వరరావు పలు అంశాలపై మాట్లాడారు. సమావేశంలో సంఘ నాయకులు లేగా సుబ్రహ్మణ్యం, పితాని రామచంద్రరావు, పాలసపూడి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మండపేట(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ టైలర్స్ డేను మండపేట అర్బన్, రూరల్‌లలో శుక్రవారం జరిపారు. కుట్టుమిషన్ సృష్టికర్త విలియంహో చిత్రపటానికి టైలర్స్ సంఘ నాయకులు నివాళులర్పించారు. మండపేటతోపాటు ద్వారపూడిలో టైలర్ల సంఘం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.



రావులపాలెం వాసవి క్లబ్‌లో టైలర్ మూర్తిని సత్కరిస్తున్న దృశ్యం



రాజగోపాల్ సెంటర్‌లో విలియమ్స్ హో చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దర్జీలు



కపిలేశ్వరపురం: అంగరలో టైలర్స్ డే నిర్వహిస్తున్న యూనియన్ నాయకులు

చోరీ కేసును ఛేదించిన పోలీసులు

• ఇద్దరు నిందితుల అరెస్టు
• రూ.1.01లక్షలు స్వాధీనం

పి.గన్నవరం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): చోరీ కేసును ఆరు రోజుల్లో పోలీసులు ఛేదించారు. ఈనెల 23న పి.గన్నవరం ప్రధాన రహదారిలో ఉన్న గణేష్ మెడికల్‌షాపులో ఇద్దరు వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్ఐ బి.శివకృష్ణ కేసు దర్యాప్తు ప్రారంభించారు. శుక్రవారం తెల్లవారు జామున ఎస్ఐతో పాటు క్రైమ్ పార్టీ సిబ్బంది అక్విడెక్టు వద్ద అనుమానాస్పదంగా ఉన్న కాకినాడకు చెందిన యండమూరి అభిషేక్ కుమార్ (24), బాలుడిని అదుపులోకి తీసుకున్నారు. నేరం చేసిన సమయంలో బైక్‌ను గుర్తించి సీఐ భీమరాజు ఆధ్వర్యంలో విచారించారు. పి.గన్నవరం, రాజోలు మండలం తాటిపాక, అమలాపురంలో జరిగిన నేరాలకు సంబంధించి నగదు, వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. దర్యాప్తులో భాగస్వాములైన సీఐ భీమరాజు, ఎస్ఐ బి.శివకృష్ణ, క్రైమ్ సిబ్బందిని ఎస్పీ బి.కృష్ణారావు, అడిషనల్ ఎస్పీ ప్రసాద్ అభినందించారు.